నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

వరంగల్

ఆదివారం | జూన్ 2, 2024 | www.navatelangana.com

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి



జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్ మాట్లాడుతూ బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను పాఠశాలల ప్రారంభం నాటికే నూతన పాఠశాలలో జాయిన్ అయ్యేలా ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ-పర్వతగిరి

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పాక శ్రీనివాస్,మండల అధ్యక్షుడు వరంగంటి సంపత్‌లు కోరారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్యపుస్తకాలు, అభ్యాస పుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫాం పూర్తి స్థాయిలో విద్యార్థులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. బడిబాటను అధికారులు, గ్రామస్తుల సహకారంతో సమర్థవంతంగా నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. అనంతరం జిల్లా ఉపాధ్యక్షుడు మేకిరి దామోదర్ మాట్లాడుతూ బదిలీ అయి రిలీవ్ కాని ఉపాధ్యాయులను పాఠశాలల ప్రారంభం నాటికే నూతన పాఠశాలలో జాయిన్ అయ్యేలా ఉత్తర్వులు జారీ చేయాలని, హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పి.ఆర్.సి కమిటీ చర్చలు పూర్తయిన నేపథ్యంలో నివేదిక తెప్పించుకొని వెంటనే వేతన సవరణ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న మెడికల్ రీయింబర్స్మెంట్, జి.పి.ఎఫ్, సరెండర్ తదితర సప్లిమెంటరీ బిల్లులన్నింటినీ, నాలుగు విడతల పెండింగ్ డి.ఏలను వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి గుండు కరుణాకర్, ఉపాధ్యక్షుడు పరిమళ శివప్రసాద్, కోశాధికారి రమావత్ శ్రీనివాస్, కార్యదర్శి పొడిచేటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓ వైపు దాడులు.. మరోవైపు దందా

జోరుగా అనుమతి లేని బీటీ 3పత్తి విత్తనాల విక్రయాలు

ఒక్కో ప్యాకెట్‌కు రూ.2,860

నకిలీ, కల్తీ, అనుమతి లేని విత్తనాల అమ్మకాలపై

నిఘా లోపించిదని సర్వత్రా విమర్శలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీటీ 3పత్తి విత్తనాల ప్యాకెట్లను విచ్చలవిడిగా విక్ర యిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్‌కు రూ.2,860ధరతో వ్యాపారులు గ్రామాల్లో విక్రయిస్తుండగా, రైతులు కొనుగోలు చేస్తున్నారు. బీటీ3 పత్తి విత్తనాల అమ్మకాలకు రాష్ట్రంలో అనుమతి లేకున్నా పరకాల, గీసుకొండ, సంగెం మండలాల్లో ఈ వెరైటీ విత్తనాలను వ్యాపారులు అమ్ముతుండడం గమనార్హం. ఒకవైపు రెవెన్యూ, పోలీసు, వ్యవ సాయ శాఖాధికారులు సంయుక్తంగా దాడులు చేస్తున్నా బీటీ3 పత్తి విత్తనాల దందా ఆగడం లేదు. ఇదిలావుంటే వ్యవ సాయాది , కారులకు తెలిసే.. ఈ విక్రయాలు జరుగుతు న్నాయన్న ఆరో పణలు బాహాటంగా వినిపి స్తున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతి లేని విత్తనాల అమ్మకాలపై సరైన నిఘా లోపించిందన్న విమర్శలు సర్వత్రా వున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 7లక్షల ఎకరాల మేరకు పత్తిని సాగు చేసే అవకాశముండటంతో అనుమతి లేని బీటీ3 పత్తి విత్తనాలను సైతం వ్యాపారులు క్షేత్రస్థాయిలో విక్రయిస్తూ దండిగా దోచుకుంటున్నారు. ఈసారి బీటీ3 పత్తి విత్తనాల సాగు జిల్లాలో సుమారు 5 నుండి 10శాతం వుంటుందనే అంచనాలున్నాయి.



ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులు పత్తిపంటను అధికంగా సాగు చేస్తారు. ఈ వానాకాలంలో ఇప్పటికే రైతులు దుక్కులు సిద్ధం చేసుకొని వర్షాల కోసం ఎదురుచూస్తున్నారు. పత్తిని సాగు చేయాలనుకుంటున్న రైతులు ఇప్పటి వరకు బీటీ2 పత్తి విత్తనాలను మాత్రమే సాగు చేశారు. గులాబీ రంగు పురుగును పూర్తిగా నాశనం చేయడంలో బీటీ 2 పత్తి విత్తనాలు కూడా ఫలితాలు ఇవ్వడం లేదన్న భావనలో రైతాంగం ఉంది. ఈ క్రమంలో మోన్‌శాంటో కంపెనీ ఇప్పటికే బీటీ3 పత్తి విత్తనాలను ఉత్పత్తి చేసి మార్కెటింగ్ చేస్తుంది. రాష్ట్రంలో బీటీ3 పత్తి విత్తనాల విక్రయానికి అనుమతి లేకున్నా రైతులు పెద్ద సంఖ్యలో బీటీ 3 పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నారు. ప్రధానంగా పరకాల సబ్‌డివిజన్‌లో పెద్ద ఎత్తున బీటీ3 పత్తి విత్తనాలను విక్రయిస్తున్నారని ప్రచారం జరుగుతుంది.

బీటీ 3 పత్తి విత్తన ప్యాకెట్‌కు రూ.2,860

బీటీ 2 పత్తి విత్తనాల ధర ప్యాకెట్‌కు రూ.864 వుండగా, బీటీ 3 పత్తి విత్తనాల ధర ప్యాకెట్‌కు రూ.2,860లకు విక్రయిస్తున్నారు. రైతుల్లో బీటీ 3 పత్తి విత్తనాలపై మోజు వుండడంతో వ్యాపారులు ఈ విత్తనాలను విక్రయించి రైతులను దోచుకుంటున్నారు. పరకాల, గీసుకొండ, సంగెం మండలాల్లో బీటీ 3 పత్తి విత్తనాలను పెద్ద ఎత్తున విక్రయిస్తున్నట్లు ప్రచారం జరు గుతున్నా రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖాధికారులు వాటిని కట్టడి చేయడంలో విఫలమయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 7లక్షల ఎకరాల మేరకు పత్తిని సాగు చేస్తున్న విషయం విది తమే. అన్ని జిల్లాల్లోనూ బీటీ3 పత్తి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. ఆన్‌లైన్‌లో పలువురు రైతులు బీటీ3 పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్నట్లు సమాచారం.

ఒకవైపు దాడులు.. మరోవైపు దందా

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నకిలీ, కల్తీ, అనుమతి లేని విత్తనాలను అరికట్టడానికి సంయుక్తంగా అధికారులు దాడులు నిర్వ హిస్తున్నా అనుమతి లేని బీటీ 3 పత్తి విత్తనాల అమ్మకాలు జరగడం గమనార్హం. వేసవి కాలంలోనే బీటీ 3 పత్తి విత్తనాల విక్రయాలు ప్రారంభమయ్యాయని తెలిసినా, వ్యవసాయ శాఖాధి కారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహ రిస్తుండడం గమనార్హం. జిల్లా కలెక్టర్లు, పోలీసు కమిషనర్, ఎస్పీలు ముందస్తుగా సమీక్షా సమావేశాలు నిర్వహించి నకిలీ, కల్తీ, అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మకాలపై కఠినంగా వ్యవహ రించాలని సిబ్బందికి ఆదేశించినా, ఈ ఆదేశాలు సమావేశాలకే పరిమి తమయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీటీ 3 పత్తి విత్తనాల అమ్మకాలు తారాస్థాయికి చేరుకున్నట్లు రైతులు చెబుతున్నారు. కోట్లాది రూపాయల వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల నేతృత్వంలో ప్రత్యేక బృందాలు దాడులు చేస్తుండగా, అనుమతి లేని బీటీ 3 పత్తి విత్తన విక్రయాల దందా కొనసాగుతుండడం గమనార్హం. అధికారుల దాడులు మొక్కుబడిగానే జరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బందికి ఏ ప్రాంతంలో అనుమతి లేని విత్తనాలు రంగ ప్రవేశం చేస్తున్నాయో తెలిసినా, వాటిని నివారించడంలో విఫలమవుతున్నారని ఆరోపణలున్నాయి.

నేడు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు

అభివృద్ధి అంతంతే..

పదేండ్లయిన పూర్తి కాని కాళోజీ కళాక్షేత్రం

జయశంకర్ పార్క్‌పై నిర్లక్ష్యం

జిల్లాల పునర్విభజనపై ఆగ్రహం

జిల్లాల విలీనంపై ఆశలు



నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు అయిన సందర్భంగా ఆదివారం ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవాలను జరుపుకోవడానికి అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఈసారి జిల్లా కలెక్టర్లే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ పదేండ్లలో రాష్ట్ర అవతరణలో భాగంగా వరంగల్ జిల్లా సమగ్రాభివృద్ధిని పరిశీలిస్తే అభివృద్ధి ఆశించినదానికి భిన్నంగా వుండడం గమనార్హం. ప్రజాకవి కాళోజీ పేరిట నిర్మించతల పెట్టిన కాళోజీ కళాక్షేత్రం పదేండ్లయినా పూర్తికాని పరిస్థితి, ప్రొఫెసర్ జయశంకర్ పేరిట నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ స్మారక ఏకశిలా పార్క్ ఆశించినస్థాయిలో నిర్మించలేకపోయారు. ఇదిలా వుంటే ఉమ్మడి వరంగల్ జిల్లాను 6ముక్కలుగా చేసి 6 జిల్లాలు చేయడం విమర్శలకు తావిచ్చింది. అంతే కాదు.. వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేసి వరంగల్, హన్మకొండ జిల్లాలుగా మార్చడం పట్ల సర్వత్రా అసంతృప్తి వ్యక్తమైంది. ఇవన్నీ తెలిసినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి భిన్నంగా తాను చేయదలచుకున్నది చేసుకుంటూ పోయింది. తాజా ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడంతో మరోమారు జిల్లాల పునర్విభజనపై మళ్లీ చర్చ ప్రారంభమైంది.

పదేండ్లయినా పూర్తికాని కాళోజీ కళాక్షేత్రం

నాటి సీఎం కేసీఆర్ వరంగల్‌లో రవీంద్ర భారతిని తలదన్నేలా ప్రజాకవి కాళోజీ పేరిట కళాక్షేత్రాన్ని నిర్మిస్తామని ప్రకటించినా, పదేండ్లయినా పూర్తి చేయలేకపోయారు. ఈ విషయంలో వరంగల్ కవులు, కళాకారులు, ప్రజలు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కాళోజీ కళాక్షేత్రానికి నిధులను సమకూర్చడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేయడం ప్రజలు జీర్ణించుకోలేకపోయారు.

జయశంకర్ పార్క్‌పై నిర్లక్ష్యం

తెలంగాణ సిద్ధాంతకర్తగా స్వర్గీయ ప్రొఫెసర్ జయశంకర్‌ను కొనియాడిన బీఆర్ఎస్ ప్రభుత్వం బాలసముద్రంలోని ఏకశిలా పార్క్‌ను ప్రొఫెసర్ జయశంకర్ స్మారక పార్క్‌గా ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ప్రొఫెసర్ జయశంకర్ పేరును చిన్న పార్క్‌గా వున్న ఏకశిలా పార్క్‌కు పెట్టడం విమర్శలకు తావిచ్చింది. ఈ పార్క్‌ను ఏర్పాటు చేయడానికి చాలా ఏండ్లు పట్టింది. ఈ పార్క్‌ను సమగ్రంగా ప్రొఫెసర్ జయశంకర్ స్థాయిలో నిర్మించడంలో నాటి ప్రభుత్వం విఫలమైంది.

జిల్లాల పునర్విభజనపై ఆగ్రహం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం 6జిల్లాలుగా చేయడం విమర్శలకు తావిచ్చింది. ముఖ్యంగా వరంగల్ నగరాన్ని చీల్చి వరంగల్, హన్మకొండ జిల్లాలుగా చేయడాన్ని వ్యతిరేకించినా, ఫలితం లేకుండాపోయింది. జిల్లాల పునర్విభజనలో 6జిల్లాలు చేసినా, ఆయా జిల్లాలకు అవసరమైన సిబ్బందిని నియమించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శించింది. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది లేక ప్రజలకు సకాలంలో సేవలందించే పరిస్థితి కరువైంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమం నీళ్లు, నిధులు, నియామకాల నినాదంతో ప్రారంభమైనా నియామకాల విషయంలో కేసీఆర్ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేయడం నిరుద్యోగులకు ఆగ్రహాన్ని తెప్పించింది. ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయడానికి పదేండ్లలో ఒక్క డిఎస్సీని కూడా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. కాకతీయ యూనివర్సిటీలో అధ్యాపకుల నియామకాలను విస్మరించింది. దీంతో యూనివర్సిటీ ప్రభ వెలవెలపోయింది. యూనివర్సిటీలకు నిధులు కరువై పరిశోధనలు చేయలేని దుస్థితి నెలకొంది.

జిల్లాల విలీనంపై ఆశలు

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జిల్లాల పునర్విభజనపై విమర్శలు పెద్ద మొత్తంలో వచ్చిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాలను విలీనం చేస్తారన్న చర్చ సర్వత్రా సాగుతుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు జిల్లాలను విలీనం చేస్తారన్న చర్చ జరుగుతుండడం గమనార్హం. ముఖ్యంగా వరంగల్ నగరం వరంగల్, హన్మకొండ జిల్లాలుగా మార్చడంపై పెద్ద ఎత్తున విమర్శలున్నాయి. ఈ రెండు జిల్లాలను విలీనం చేసి వరంగల్ జిల్లాగా కొనసాగిస్తారన్న ప్రచారం జరుగుతుంది. ఏదేమైనా ఈ పదేండ్ల ప్రస్తానంలో కొత్త భవనాలు వస్తే రావచ్చు కాని ఆశించిన పాలన కొత్త జిల్లాల్లో లేకపోవడం బిఆర్ఎస్ పార్టీపై ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపి ఓటమి చవి చూసేలా చేసింది.



మంత్రులను కలిసిన డీసీసీబీ ఛైర్మన్ 'మార్నేని'

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను వరంగల్ డీసీసీబీ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు హైద్రాబాద్‌లో మంత్రులను కలిసిన రవీందర్‌రావు వారికి పుష్పగుచ్ఛాలిచ్చి, బ్యాంకు మొమెంటోలను అందచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిపాజిట్లను సహకార బ్యాంకులలో డిపాజిట్ చేయాలని కోరారు. మంత్రి సురేఖతో పాటు ఆమె భర్త, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావును కలిశారు.



మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నర్సంపేట

పోస్టుల నియమాకంలో నిబంధనలు పాటించని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేష్, పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి అల్లా నరేష్ డిమాండ్ చేశారు. శనివారం మెడికల్ కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ కాలేజ్‌లో కిందటి నెల 19న జిల్లా కలెక్టర్ 12 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా అనేక మంది నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. నిబంధనల ప్రకారం అభ్యర్థుల అర్హత ఆధారంగా ఎంపిక చేయాల్సి ఉండగా ప్రిన్సిపాల్, ఏజన్సీలు ఎంపిక చేసి అర్హులకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా మరో 20పోస్టులను భర్తీ చేశారని వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి విచారణ చేపట్టి ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకుని, అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థి, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ జిల్లా నాయకులు సాయి,ప్రశాంత్‌భూషణ్‌పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-నర్సంపేట

మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం సాదాసీదగా సాగింది. శనివారం ఎంపీపీ మోతె కలమ్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఏజెండా అంశాల వారిగా ఆయ శాఖల అధికారులు నివేదించారు. మండల పాలకవర్గానికి చివరి సర్వసభ్య సమావేశం కాగా ఆరుగురు ఎంపీటీసీలు మాత్రమే హాజరైయ్యారు. శాఖవారిగా ఎలాంటి చర్చలేకుండనే ఏజెండా అంశాలకు ఆమోదం తెలుపడం విస్మయానికి గురిచేసింది. మండలంలో తాగు నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, వ్యవసాయ సీజన్‌లో విత్తనాల సరఫరా వంటి ప్రధాన సమస్యలపై ఎంపీటీసీలు చర్చించకపోవడంపై ప్రశ్నలు ఉత్పన్నమైయింది. చివరి సమావేశాన్ని కూడా ఎంపీటీసీలు సద్వినియోగం చేసుకొని సమస్యల పరిష్కారానికి చోరువ చూపకపోవడం విమర్శలు వెలువెత్తుతున్నాయి.ఈ సమావేశంలో ఎంపీవో సునిల్ కుమార్ వివిధ శాఖల అధికారులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో అధికారుల బృందం తనిఖీలు



నవతెలంగాణ-నర్సంపేట

విత్తన దుకాణాలను వ్యవసాయ, పోలీసు, రెవిన్యూ అధికారులు తనిఖీలు చేపట్టారు. శనివారం పట్టణంలోని పరమేశ్వర, బొడ్డిరెడ్డి నర్సింహారెడ్డి, లక్ష్మీ విత్తన దుకాణాలను సీఐ డీ.రాంమూర్తి, ఏవో కృష్ణ కుమార్ తనిఖీ చేశారు. విత్తన నిల్వలు, రశీదు పుస్తకాలను పరిశీలించారు. పరమేశ్వర విత్తన దుకాణంలో అమ్మకాలకు సంబంధించి రశీదులను సక్రమంగా నిర్వర్తించకపోవడంపై సీఐ రాంమూర్తి డీలర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏవో కృష్ణ కుమార్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం తనిఖీలు చేపడుతున్నామని, విత్తన డీలర్లు నిబంధనల ప్రకారం అమ్మకాలు చేయాలన్నారు. చుట్టూ మండలాల రైతులు ఇక్కడే కొనుగోలు చేస్తున్నందున డీలర్‌లు 57వేల పత్తి విత్తన ప్యాకెట్‌లు అందుబాట్లోకి తీసుకరాగా ఇప్పటి వరకు 28వేలపైగా అమ్మకాలు సాగాయన్నారు. పత్తి విత్తనాలు కొరత లేదని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రైతులు వ్యవసాయాధికారులకు నేరుగా ఫిర్యాదు చేసినట్లయితే తక్షణమే స్పందించి పరిష్కరిస్తామని చెప్పారు.

రాయపర్తి : ఎరువులు, విత్తనాలకు కత్రిమ కొరతను సష్టించే డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సందీప్‌కుమార్, వ్యవసాయ అధికారి వీరభద్రం హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫర్టిలైజర్ దుకాణాల నిర్వాహకులు, డీలర్లతో విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సమావేశంలో ఏఎస్ఐ సదానందం, ఏఈఓలు రాజేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నెక్కొండ : రైతులకు విక్రయించే విత్తనాలు నాణ్యమైనవి మాత్రమే విక్రయించాలని, రైతులకు విక్రయాలు జరిపే ప్రతి వివరాలను తప్పనిసరిగా రిజిస్టర్‌లో నమోదు చేయాలని మండల విత్తన టాస్క్‌ఫోర్స్ సభ్యులు వ్యాపారులకు సూచించారు. నెక్కొండలోని విత్తన దుకాణాలను శనివారం మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఎస్సై మహేందర్, డిప్యూటీ తహసిల్దార్ రవి బందం పలు షాపులను తనిఖీ చేసి రిజిస్టర్లలో వివరాలను పరిశీలించారు.రైతులకు విక్రయించిన ప్రతిసారి విత్తనాల, ఎరువులకు సంబంధించి బిల్లులపై రైతుల సంతకాలను తీసుకోవాలని సూచించారు.

ఖానాపురం : మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో శనివారం రెవెన్యూ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై రఘుపతి, వ్యవసాయ శాఖ అధికారి భోగ శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహించారు. విత్తన డీలర్లు, షాపు యజమానులు ప్రభుత్వ అనుమతి పొందిన విత్తనాలను మాత్రమే రైతులకు విక్రయించాలని, విధిగా విక్రయించిన రసీదు సంబంధిత రైతులకు అందించాలని అన్నారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో పచ్చి రొట్ట ఎరువుల విత్తనాలు 265సంచులు (80 క్వింటాళ్ళ)(జీలుగ) అందుబాటులో ఉన్నాయని వాటిని అవసరం ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ ఉద్యోగి ఐలేష్, మండల హెడ్ కానిస్టేబుల్ సారయ్య లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

వార్డు ఆఫీసర్లుగా బిల్ కలెక్టర్లు, వీఆర్‌ఏలు

విధుల నిర్వహణపై దిశా నిర్దేశం



నవతెలంగాణ-వరంగల్

వార్డు ఆఫీసర్లు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అన్నారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్‌హాల్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న వార్డు ఆఫీసర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కమిషనర్ పాల్గొని సమర్థవంతంగాగా విధులు నిర్వహించడానికి తగు సూచనలు చేశారు. నగరవ్యాప్తంగా ఉన్న 66డివిజన్లకు వార్డు ఆఫీసర్లను కేటాయించిన నేపథ్యంలో వారు అంకితభావంతో విధులు నిర్వహించాలని, వార్డు ఆఫీసర్లు వారికి కేటాయించిన డివిజన్‌లలో స్థానిక కార్పొరేటర్‌తో సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం మునిసిపల్ చట్టం- 2019 ప్రకారం జీ ఓ నం.236 ద్వారా ప్రభుత్వ బిల్ కలెక్టర్‌లను, వీఆర్‌ఏలను వార్డు ఆఫీసర్లుగా మార్చాలని ఉత్తర్వుల్లో పేర్కొందని, అందుకు అనుగుణంగా వీఆర్‌ఏలు, బిల్ కలెక్టర్లు వార్డు ఆఫీసర్లుగా విధులు నిర్వ హించనున్నారని తెలిపారు. వార్డు ఆఫీసర్లు జాబ్‌చార్ట్‌పై అవగాహన ఏర్పరచుకొని శానిటేషన్, నీటి సరఫరా, పెన్షన్ల మంజూరు ధవీకరణ అంశాలతో పాటు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దష్టి సారించి ఆర్ఐలతో సమన్వయం చేసుకుంటూ నిర్దేశిత వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోవాలని అదనపు కమిషనర్ అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కష్ణారెడ్డి, ఆర్ఓలు యూసుఫోద్దీన్, సుదర్శన్, షహజాది బేగం పాల్గొన్నారు.

ప్రాణం తీసిన రూపాయి

ఇద్దరు యువకుల మధ్య ఘర్షణ - ఒకరి మృతి

నవతెలంగాణ-కాశిబుగ్గ

బిర్యానీ బిల్లుల చెల్లింపు విషయంలో ఇద్దరు యువకుల మధ్య చెలరేగిన ఘర్షణ చివరికి ఒకరి ప్రాణాలు తీసింది. ఈ ఘటన శుక్రవారం రాత్రి వరంగల్ నగరంలోని గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. మిల్స్ కాలనీ సీఐ మల్లయ్య, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వరంగల్ క్రిస్టియన్ కాలనీకి చెందిన ఈసంపెల్లి ప్రేమ్‌సాగర్ (30) శుక్రవారం రాత్రి 11గంటల ప్రాంతంలో 100 ఫీట్ల రోడ్డులోని ఓ బిర్యాని సెంటర్‌లో బిర్యానీ తీసుకొని రూ.59 బిర్యానీకి గాను రూ.60 ఫోన్ పే కొట్టాడు. అదే సమయంలో గాంధీనగర్ ప్రాంతానికి చెందిన జన్ను అరవింద్ అక్కడే ఉన్నాడు. రూ.60గాను తాను రూ.60ఫోన్ పే కొట్టానని తనకు రూపాయి ఇవ్వాలని ప్రేమ్‌సాగర్ బిర్యానీ సెంటర్ యజమానిని కోరాడు. ఈ క్రమంలో అరవింద్ జోక్యం చేసుకొని ప్రేమ్‌సాగర్‌తో ఘర్షణకు దిగాడు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. తీవ్ర ఆవేశానికి లోనైనా అరవింద్ నెట్టివేయడంతో ప్రేమ్‌సాగర్ కింద పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయం కావడంతో ప్రేమ్‌సాగర్ అక్కడికక్కడే మతి చెందాడు. మతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మిల్స్ కాలనీ పోలీసులు తెలిపారు.





ఎస్సార్ నగర్‌లో ఖాళీ ప్లాట్లను కాపాడాలి

నవతెలంగాణ కాశిబుగ్గ

ఎస్ఆర్‌నగర్‌లోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో లబ్ది పొందిన వారు మళ్లీ కాలనీలోని ఖాళీ ప్లాట్లను ఆక్రమిస్తూ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నారని బీజేపీ 14వ డివిజన్ అధ్యక్షుడు కొత్తకొండ రాజు అన్నారు. శనివారం ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని ఎస్సార్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కొత్తకొండ రాజు మాట్లాడుతూ ఎస్సార్ నగర్ కాలనీకి చెందిన గంజి పద్మ అనే మహిళ ఎస్సార్‌నగర్‌లోని 60 గజాల స్థలం గల తన ఇంటిని కూల్చుకోగా ప్రభుత్వం ఆమెకు డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇచ్చిందన్నారు. అయినప్పటికీ ఆమె అధికార పార్టీ నాయకుల అండదండలతో తనకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇంటిలో ఉంటూనే మళ్లీ 60గజాల స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతుందని అన్నారు. ఎస్సార్ నగర్ గ్రామానికి అంగన్‌వాడీకి సొంత భవనం లేనందున ఆ స్థలంలో అంగన్వాడీ భవనాన్ని నిర్మించాలనుకున్నామని, కానీ గంజి పద్మ అధికార పార్టీ నాయకుల అండదండలతో స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతుందన్నారు. ఈ విషయంపై తాము రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, రెవెన్యూ, వరంగల్ మున్సిపల్ అధికారులు స్పందించి ఆ స్థలంలో గంజి పద్మ చేపడుతున్న ఇంటి నిర్మాణాన్ని నిలిపేసి, ఆ స్థలం ఎస్సార్‌నగర్‌కు ఉపయోగపడేలా చూడాలని కోరారు. ఎస్సార్ నగర్‌లో ఖాళీగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో, ఖాళీగా ఉన్న స్థలాలను ఇండ్లు లేని నిరుపేదలకు కేటాయించాలని రాజు కోరారు. సమావేశంలో నాయకులు చిరంజీవి, శ్రీను, తరాల కుమార్, అపర్ణ, దేవిక పాల్గొన్నారు.

వివేకానంద కాలనీలో మహాన్నదానం

నవతెలంగాణ-కాశిబుగ్గ

హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం కాశిబుగ్గ వివేకానంద కాలనీలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి 19, 20వ డివిజన్ల కార్పొరేటర్లు ఓని స్వర్ణలత భాస్కర్, గుండేటి నరేంద్ర కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు స్వర్ణలత భాస్కర్, నరేంద్ర కుమార్‌లు మాట్లాడుతూ అన్ని దానాలలో కెల్లా అన్నదానం గొప్పదన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ధూపం సంపత్, గుల్లపల్లి రాజ్ కుమార్, చిలువేరు శ్రీనివాస్, కొరవి పరమేష్, కత్తెరశాల భారత్, క్యాతం రంజిత్, వేముల నాగరాజు, బొప్ప రాతి నగేష్, వంగరి రాం ప్రసాద్, బాల మోహన్ రాజ్, చిలువేరు పవన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
హనుమకొండ 2
ఆదివారం | జూన్ 02, 2024 | www.navatelangana.com

విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తాం

- ఎన్‌పీడీసీఎల్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ పరిధిలో విపరీతమైన ఎండల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని, ముందస్తు ప్రణాళిక ప్రకారం ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం పడకుండా డిసెంబర్ 2023 నుండి మే 2024 వరకు వివిధ కెపాసిటీగల 3335 ట్రాన్స్‌ఫార్మర్లు పెట్టడం జరిగిందని చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 2022 నుండి మే 2023లో 2804 ట్రాన్స్‌ఫార్మర్లను పెట్టారని అన్నారు. 531 ట్రాన్స్‌ఫార్మర్లు పెరిగాయని, పీక్‌డిమాండ్ సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్ భారం తెలుసుకునేందుకు టాంగ్‌టెస్టర్ రీడింగ్ తీసుకొని ఆ రీడింగ్ ఆధారంగా ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచుతున్నామని తద్వారా ట్రాన్స్ఫార్మర్లపై లోడ్ భారం తగ్గిందని అ లాగే ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు 25 శాతం తగ్గిందని, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు కూడా 23 శాతం తగ్గడం గమనార్హం అని అన్నారు. ఫలితంగా వినియోగదారులకు కనిష్టస్థాయికి అంతరాయాలు తీసుకురాగలిగామని చెప్పారు. ఈ ఫలితాలే రాష్ట్రము లో మార్చి 8న 15623 మెగావాట్ల విద్యుత్ వినియోగం రికార్డు నమోదయిందని ఈ సందర్భంగా అన్నారు.

303.6 మిలియన్ యూనిట్ల మైలు రాయిని చేరుకుందని, మొత్తంగా గణనీయంగా 33 బ్రేక్ డౌన్స్, 33 కె వి ట్రిప్పింగ్స్, ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు, పవర్ ట్రాన్స్ఫార్మర్ల వైఫల్యాలు తగ్గినందు వలన రాష్ట్ర విద్యుత్ డిమాండ్ తార స్థాయికి చేరిందని, ఇదంతా కేవలం వినియోగదారులకు అంతరాయాలు లేకుండ మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా ప్రజలకు అందించడం వలెనే సాధ్యమైందని తెలిపారు. ప్రణాళిక బద్దంగా ముందుకు వెళ్తున్నామని, విద్యుత్ అధికారులు, సిబ్బంది రేయింబవళ్లు, క్రియాశీలకంగా, నిబ్బద్దతతో పని చేస్తున్నారని, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ పేర్కొన్నారు.

ప్రెస్‌క్లబ్‌కు ఎల్లవేళలా అండగా ఉంటా

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన స్పోర్ట్స్ మీట్-2024 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ప్రెస్ క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుండి పదవులున్నా, లేకున్నా జర్నలిస్టులతోస్నేహపూర్వకంగా మెదులుతాన్నానని, మంచి, చెడులలో చేదోడు, వాదోడుగా నిలుస్తున్నానని అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమని చెప్పిన నాయిని నిత్యం ఉరుకులు, పరుగులతో వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులకు క్రీడలు ఒక ఆటవిడుపుని అన్నారు. స్పోర్ట్స్ మీట్-2024 పోస్టర్ ను క్లబ్ బాధ్యులతో కలసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, జర్నలిస్టు సంఘాల నేతలు బీఆర్ లెనిన్, తోట సుధాకర్, గడ్డం కేశవమూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

మిల్క్‌పార్లర్ ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎస్ఆర్



నవతెలంగాణ-శాయంపేట

మండల కేంద్రంలోని కోడూరి తిరుపతి అరుణ దంపతులు ఏర్పాటుచేసిన అరుణ మిల్క్‌పార్లర్‌ను శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొని ప్రారంభించారు. దినదినం వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ పాల డైరీ అధినేత సంపత్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దూదిపాల బుచ్చిరెడ్డి, ఎంపిటిసి బాసాని చంద్రప్రకాష్, మాజీ జెడ్పిటిసి చల్లా చక్రపాణి, పరకాల ఏఎంసీ మాజీ చైర్మన్ పోలపల్లి శ్రీనివాసరెడ్డి, నాయకులు చిందం రవి, నిమ్మల రమేష్, మారపల్లి రవీందర్, కట్టయ్య పాల్గొన్నారు. అనంతరం ప్రగతి సింగారం కాంగ్రెస్ నాయకులు బోనేపెల్లి రఘుపతి రెడ్డి మహమ్మద్ గౌస్‌పల్లి వద్ద నిర్మించిన అతిపెద్ద ఆంజనేయ విగ్రహం వద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

నవతెలంగాణ-శాయంపేట

చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని చేనేత సొసైటీ మాజీ చైర్మన్, ఎంపిటిసి బాసాని చంద్రప్రకాష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం అయన విలేకరులతో మాట్లాడుతూ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు రాపోలు వీరమోహన్ ఈనెల 3న శాయంపేట చేనేత సొసైటీని పాలకవర్గంతో సందర్శించనున్నట్లు తెలిపారు. ఈనెల 3న ఉదయం 11 గంటలకు చేనేత సొసైటీలో జరిగే సమావేశానికి పద్మశాలీలు పవర్లూమ్ కార్మి కులు, చేనేత కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను విన్న వించుకోవాలని చంద్రప్రకాష్ కోరారు.

నకిలీ అనుమతి పత్రాలతో రిజిస్ట్రేషన్

- పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు నమోదు



నవతెలంగాణ-వేలేరు

పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ, గ్రామ పంచాయతీ స్టాంపులను నకిలీవి తయారు చేసి దొంగ అనుమతిపత్రాలను తయారు చేసి అక్రమంగా ఆస్తి రిజిస్ట్రేషన్ చేసుకున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ డి.హరిత తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ వేలేరు మండల కేంద్రానికి చెందిన గొట్టెముక్కల సరోజన, ఇట్టబోయిన వీరయ్య, బిల్ల లక్ష్మీ బిల్ల రవళి అనే నలుగురు వ్యక్తులు వేలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శి జెరవికుమార్ సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ రబ్బర్ స్టాంప్ లు, ధృవీకరణ పత్రాలతో భీమదేవరపల్లి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని కార్యదర్శి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి ఫిర్యాదుమేరకు నలుగురు నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్



నవతెలంగాణ-హసన్‌పర్తి

మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్‌కళాశాలలో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్-2024 కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సార్ విద్యా సంస్థల చైర్మెన్ ఎనగందుల వరదారెడ్డి, కాగ్నిజెంట్ టెక్నాలజీ హెచ్ఆర్ మేనేజర్ జితెందర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి జ్యోతి ప్రజ్వళన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జితెందర్ మాట్లాడుతూ విద్యార్థినీలు లాజికల్ స్కిల్స్ ఉపయోగించి కోడింగ్ సరళిలో మార్పులు తీసుకురావాలని కోరారు. చైర్మెన్ వరదారెడ్డి మాట్లాడుతూ విద్యార్థినీలు ఉద్యోగాలు చేస్తూ నూతన ఆవిష్కరణలు చేసి సమాజాభివృద్ధికి సహకరించి ఉన్నత స్థాయికి ఎదగలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ కళాశాలలో పాఠ్యప్రణాళికతో పాటుగా ప్లేస్‌మెంట్ సంబందించిన లాజికల్ స్కిల్స్, కోడింగ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ మొదలైన అంశాలపై ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే ఒక ప్రణాళిక ప్రకారం శిక్షణ తరగతులు నిర్వహిస్తామని తెలిపారు. దీంతో నూటికి నూరు శాతం ప్లేస్‌మెంట్ సాధిస్తున్నామని తెలిపారు. ఆక్సెంచర్, టీసీఎస్, క్యాప్‌జెమిని, జెన్‌ప్యాక్ట్, ఇన్‌ఫోసిస్, డీఎక్స్‌సీ టెక్నాలజీస్, పబ్లిక్స్, లెగటో, విప్రో, ఇంటెల్లిప్యాక్ట్, స్కిల్ దునియా మొదలగు కంపెనీలలో విద్యార్థినీలు ఉద్యోగ అవకాశాలు పొందారని ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ మహేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాలస్వామి, వివిధ విభాగాధిపతులు ఇ.సుదర్శన్, డాక్టర్ కె.మహెందర్, డాక్టర్ ఎస్.శ్రీవాణి, అధ్యాపకులు, విద్యార్థినీలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాకతీయ యూనివర్శిటీలో పరీక్ష పత్రాల గందరగోళం

- విద్యార్థులు రాసిన పరీక్షా పేపర్లు బయటికి
- గుట్టు చప్పుడు కాకుండా తిరిగి చూచిరాత
- సీసీ పుటేజీ ఆధారంగా నిందితుల గుర్తింపు
- కేయూ పీఎస్‌లో ముగ్గురిపై కేసు



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీలో పరీక్షా పత్రాలపై గందరగోళం నెలకొంది. విద్యార్థులు రాసిన పరీక్షా పేపర్లను గుట్టు చప్పుడు కాకుండా తిరిగి చూచిరాత ద్వారా తిరిగి వాటిని పరీక్షా కేంద్రాలకు పంపి మెరిట్ విద్యార్థులకు అన్యాయం చేయడం విశ్వవిద్యాలయంలో కలకలం రేపింది. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా బయటకు పొక్కడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. దీంతో కేయూ పరీక్షల ని యంత్రణ అధికారులు పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేయడంతో సీసీ పుటేజీల ఆధారంగా అసలు విషయం బయటకు పొక్కింది. వివరాల్లోకి వెళితే... కాకతీయ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచిలో దినసరి వేతన కూళీలుగా పనిచేస్తున్న సునీల్, రాణాప్రతాప్, శ్రీధర్‌లు కాసులకు కక్కుర్తిపడి డిగ్రీ పరీక్షలు రాసిన జవాబు పత్రాలను ఎగ్జామినేషన్ బ్రాంచి నుంచి బయటకు తీసుకువచ్చి తిరిగి జవాబు పత్రాలను చూచిరాసి గుట్టు చప్పుడు కాకుండా ఎగ్జామినేషన్ బ్రాంచికి తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన డిగ్రీ పరీక్షలలో కొంత మంది విద్యార్థులకు సంబంధించిన డిగ్రీ జవాబు పత్రాలను వారు ఎగ్జామినేషన్ బ్రాంచి నుంచి బయటకు తీసుకువచ్చి ఎక్కువ మార్కులు వచ్చేవిధంగా జవాబులు నింపి తిరిగి ఎగ్జామినేషన్ బ్రాంచిలో ఆ పత్రాలను సర్ది పెట్టినట్లు తెలిసింది.

ఈ విషయంపై కేయూలో గందరగోళం నెలకొనడంతో అప్రమత్తమైన కేయూ పరీ క్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ నర్సింహచారి అక్కడ ఏర్పాటు చేసిన సీసీ పుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించి కేయూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేయూ పోలీసులు అనుమానితులైన ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా అసలు నేరం ఒప్పుకున్నట్లు తెలిసింది. కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఫిర్యాదు మేరకు ఎగ్జామినేషన్ బ్రాంచిలో మోసాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు దినసరి కూలీలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు కేయూ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ తెలిపారు. యూనివర్సిటీలో జరిగిన ఘటనపై ఇన్చార్జి వీసీ వాకాటి కరుణ సీరియస్ అయ్యారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో జరిగిన ఘటనపై ఆమె ఆరా తీసినట్లు తెలుస్తోంది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డితో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసకొని ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇంచార్జి వీసీ కరుణ హెచ్చరించారు.

ఏడాదిగా లీకేజీలున్నా మరమ్మతు చర్యలు శూన్యం

- పట్టించుకోని అధికారులు
- ట్యాంక్ నుండి వృథాగా పోతున్న తాగునీరు



నవతెలంగాణ-శాయంపేట

గ్రామాలలోని ప్రజలకు సురక్షితమైన నీరు అందించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకంలో నిర్మించిన వాటర్ ట్యాంక్ లోకి నీరు ఎక్కించేందుకు ఏర్పాటుచేసిన పైపు లీకేజీ ఏర్పడి ఏడాది గడుస్తున్న అధికారులు మరమ్మతు పనులు చేపట్టడంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. దీంతో తాగునీరు వృథాగా పోతుంది. వివరాల్లోకి వెళితే శాయంపేట పిహెచ్‌సీ ఆవరణలో 1.20 లక్షల లీటర్ల నీటిసామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టారు. మిషన్ భగీరథ నీటిని ఎక్కించేందుకు పైప్‌లైన్ వేయగా లీకేజీలు ఏర్పడి నీరు వృథాగా పోతుంది. అధికారులు సందర్శించి మరమ్మత్తు చేయించాలని సిబ్బందిని ఆదేశించి ఏడాది గడుస్తున్న ఇప్పటివరకు మరమ్మత్తుకు నోచుకోలేదు. దీంతో త్రాగునీరు వధాగా పోయి ట్యాంక్ ప్రాంగణంలో బురదమయంగా మారింది.

ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైను మరమ్మతు చేసి తాగునీరు వృథా కాకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలి : జేడీఏ





నవతెలంగాణ-దామెర

రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలు అందించాలని కృత్రిమకొరత సృష్టించవద్దని ఎమ్మార్పీ ధరలకు మాత్రమే అమ్మకాలు సాగించాలని వ్యవసాయసహాయక సంచాలకులు వంగ రవీందర్‌రెడ్డిఅన్నారు. శనివారం మండలంలోని దామెర, ఊరుగొండ గ్రామాల్లో సీడ్స్, ఫర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులకు నకిలీ విత్తనాలు అమ్మవద్దని, విత్తనాలు ఎరువులను ఎమ్మార్పీ రేట్లకు మించి విక్రయిస్తే చర్యలుతప్పవని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో జ్యోతి వరలక్ష్మిదేవి, ఏవో శ్రీనివాస్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ డీలర్ల వద్దనే కొనుగోలు చేయాలి

శాయంపేట : విత్తనలైసెన్స్ కలిగి ఉన్న డీలర్ల దగ్గర మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని మండల వ్యవసాయ అధికారి కే.గంగ జమున రైతులకు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖలు సంయుక్తంగా మండల టాస్క్‌ఫోర్స్ టీంగా ఏర్పడి శనివారం మండల పరిధిలోని గ్రామాలలోని విత్తన షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్ లను, బిల్లుబుక్కులను, లైసెన్సులను, స్టాక్ బోర్డులను, విత్తన ప్యాకెట్లపై ముద్రించిన సమాచారాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పత్తి పంటలో మేలైన యజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు సాధించవచ్చని, పత్తిలో హైబ్రిడ్ విత్తన రకలన్ని ఒకే తరహా దిగుబడులను ఇస్తాయన్నారు. ఒకేరకమైన విత్తనాల కోసం పోటీ పడాల్సిన అవసరం లేదన్నారు. విత్తనాల కొను గోలుకు సంబంధించి బిల్, రసీదు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. పంటకాలం పూర్తయ్యే వరకు రసీదు భద్రపరచుకోవాలని రైతులకు సూచనలు చేశారు. రసీదుపై విత్తనం అన్ని వివరాలు ఉండాలని, విత్తన ప్యాకెట్ మీద మ్యానుఫ్యాక్చర్ డేట్, ఎక్స్పైరీ డేట్ ఉందో లేదో గమనించాలని చూడాలన్నారు. గ్రామాలలో లూజు విత్తనాలు, నకి లీ విత్తనాలు అమ్మిన కొనుగోలు చేయవద్దని, వ్యవసాయ శాఖకు సమాచారం చేరవేయాలని రైతులకు సూచించారు.

విత్తనాలను అధిక ధరలు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వై శరత్ కుమార్, ఏఆర్ఐ హుస్సేన్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష ప్రారంభమయ్యే వరకు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు

- జిల్లా కలెక్టర్ సిక్తాపట్నాయక్



నవతెలంగాణ-హసన్‌పర్తి

గ్రూప్-1 సర్వీస్ పరీక్షల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు జూన్ 1 నుంచి కమిషన్ వెబ్‌సైట్‌లో పరీక్ష ప్రారంభం అయ్యేవరకు హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. అభ్యర్థులను ఉదయం 9:00 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారని తెలిపారు. పరీక్షాకేంద్రం గేట్ ఉదయం 10 గంటలకు మూసి వేయబడుతుందని, 10 గంటల తర్వాత అభ్యర్థులెవరిని కూడా పరీక్షా కేంద్రంలోకి ప్రవేశించడానికి అనుమతించరని తెలిపారు. అభ్యర్థులకు ముందుగా ముద్రించిన వివరాలతో కూడిన ఓఎంఆర్ జవాబు పత్రం అభ్యర్థులకు అందించబడుతుందన్నారు. అభ్యర్థులు పరీక్ష ప్రారంభించే ముందు ఓఎంఆర్ జవాబు పత్రం, ప్రశ్న పత్రంపై ముద్రిం చిన సూచనలను అనుసరించాలని తెలిపారు. అ భ్యర్థి సౌలభ్యం కోసం చివరి నిమిషంలో గందర గోళాన్ని నివారించడానికి బబ్లింగ్ మొదలైన వాటికి సంబంధించిన సూచనలను, విధానాన్ని అర్థం చేసుకోవడానికి కమిషన్ వెబ్‌సైట్‌లో నమూనా ఓఎంఆర్ షీట్ అందుబాటులో ఉంచబడు తుందని, అభ్యర్థులు మోడల్ ఓఎంఆర్‌ని డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షా స మయం పూర్తి అయ్యేవరకు పరీక్షహాలు నుండి బయటకు రాకూడదని తెలిపారు. పరీక్ష హాలు నుండి బయలుదేరే ముందు అభ్యర్థి ఓఎంఆర్ జవాబు ప త్రాన్ని ఇన్విజిలేటర్లకు అందజేయాలని తెలిపారు. హాల్ టికెట్ పై ముద్రించిన సూచనలను కూడా అభ్యర్థులకు అందుబాటులో ఉంచామని తెలిపారు.

అభ్యర్థులు ప్రిలిమినరీ పరీక్షకు హాజరు అవుతున్నప్పుడు సూచనలను జాగ్రత్తగా పరిశీలించి వాటిని అనుసరించాలని సూచించారు. అభ్యర్థులు చేసిన తప్పులకు ఓఎంఆర్ లేదా జవాబు పత్రం/ హాల్ టికెట్/ప్రశ్నపత్రం బుక్‌లెట్ పైన ముద్రించిన సూచనలను ఉల్లంఘించినందుకు కమిషన్ బాధ్యత వహించదని చెప్పారు. అభ్యర్థులకు కేటాయించిన పరీక్ష హాలులో బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ల ద్వారా అభ్యర్థుల బయోమెట్రిక్‌లను క్యాప్చర్ చేయడం ఉదయం 9:30గంటలకే ప్రారంభం అవుతుందని, బయోమెట్రిక్ ఇన్విజిలేటర్ ద్వారా తన బయోమెట్రిక్‌లను క్యాప్చర్ చేసే వరకు అభ్యర్థులు ఎవరు పరీక్షహాలు నుండి బయటకు వెళ్లకూడదని అభ్యర్థులకు తెలియజేశారు. ఎవరైనా అభ్యర్థి తన బయోమెట్రిక్‌లను ఇవ్వకపోతే అతని/ఆమె ఓఎంఆర్ జవాబు పత్రం మూల్యాంకనం చేయబడదని తెలిపారు. అభ్యర్థులు క్యాలిక్యులేటర్లు, సెల్‌ఫోన్లు, బ్లూటూత్, స్మార్ట్ వాచ్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను ఇతర వస్తువులను అభ్యర్థి తమ వెంట తీసుకో రాకూడదని తెలిపారు. బూట్లు ధరించకుండా చెప్పులతో లోనికి రావాలని సూచించారు. అభ్యర్థులు తన వేళ్లపై బయోమెట్రిక్ రికార్డింగ్‌కి ఆటంకం కలిగించే మెహెంది, ట్యాటూ, లేదా ఏదైనా ఆబ్జెక్టివ్ మెటీరియల్ కవర్లను కలిగి ఉండకూడదని తెలిపారు. అభ్యర్థులు వస్తువులు భద్రపరచడానికి కమిషన్ ఎలాంటి క్లాక్ / స్టోరేజ్ సౌకర్యాన్ని కల్పించదని చెప్పారు.

అభ్యర్థుల సౌలభ్యం కోసం సమయాన్ని అంచనా వేయడానికి ప్రతి అరగంట పూర్తయిన తర్వాత హెచ్చరిక బెల్ మోగించబడుతుందని అంతేకాకుండా పరీక్ష హాలు ఇన్విజిలేటర్‌లను కూడా సమయాన్ని అడిగి తెలుసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యే ముందు వారి సొంత ఆసక్తితో సూచనలను అర్థం చేసుకోవాలని సూచించారు. తద్వారా వారి అభ్యర్థిత్వం తిరస్కరణ చెల్లు బాటు కాకుండా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

నేడు హనుమకొండ కలెక్టరేట్‌లో తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సుబేదారి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఉద యం 8.30 గంటలకు అమరవీరుల స్థూపం వద్ద జిల్లాకలెక్టర్ నివాళులర్పించి 9 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ జాతీయ పతాకా విష్కరణ చేస్తారు.

కల్తీ వస్తువులపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

వినియోగదారులు కల్తీ వస్తువులపై ఆహార పదార్థాలపై అవగాహన కలిగి ఉండాలని వినియోగదారుల కో-ఆర్డినేషన్ కౌన్సిల్ సౌత్ ఇండియా చైర్మన్ పల్లెపాడు దామోదర్ అన్నారు. శనివారం హనుమకొండ అలంకార్‌లోని విజయ డైరీ లో వినియోగదారుల కో-ఆర్డినేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని అన్నిరకాల పాలఉత్పత్తుల ప్యాకేజీ పాల ప్యాకెట్లను తీసుకొని లాబ్ వెహికిల్ ద్వారా వాటి క్వాలిటీని పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలలో కల్తీ జరిగితే అది చిన్నపిల్లల, యువకుల, మహిళల ఆరోగ్యాలపై తీవ్ర ప్రభావం చూపించడంతో పాటు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న విజయ డైరీ పాలు నాణ్యతను పాటిస్తూ వినియోగదారులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం ప్రాసెసింగ్ జరుగుతుందని తెలిపారు. కానీ ప్రైవేటు డైరీలకు సంబంధించిన పాలలో కొన్ని రసాయనాలు చేరడం వల్ల వినియోగదారులు అనేక సమస్యలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినియోగదారులు ఏవి కల్తీ పాలు ఏవి నాణ్యమైన పాలు అనే విషయాన్ని గమనించి వినియోగించాలని కోరారు.

విజయ డైరీ డిప్యూటీ డైరెక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ నగరంలో ఉన్న వివిధ కంపెనీలకు సంబంధించిన పాలను పరీక్షించేందుకు వినియోగదారుల కో-ఆర్డినేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నాణ్యత పరీక్షలు నిర్వహించారని పరీక్షల్లో విజయ డైరీ నాణ్యమైన పాలుగా ఎలాంటి కల్తీ లేకుండా ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగాపనిచేస్తుందానినిరూపితమైందన్నారు. ఈకార్యక్రమంలో విజయ డైరీ అధికారులు, వినియోగదారుల ఫోరం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎన్ఆర్ఐ రాంరెడ్డి చేయూత



నవతెలంగాణ-ధర్మసాగర్

బాధిత కుటుంబసభ్యులకు రామన్న యువసేన సభ్యులు ఎన్ఆర్ఐ వల్లపురెడ్డి రాంరెడ్డి 50 కిలోల బియ్యం అందజేసి చేయూతనందించారు. మండలంలోని నారాయణగిరి గ్రామానికి చెందిన పుట్ట మొగిలి ఇటీవల అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబ సభ్యులను వల్లపురెడ్డి రాంరెడ్డి ఎన్నారై శనివారం చేయుతనందించారు. ఈ మేరకు శనివారం రామన్న యువసేన సభ్యులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి,వారి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పుట్ట కుమార్, మడి కంటి వెంకటయ్య, గంటేకృష్ణ, పుట్ట చంద్రు, మేడబోయిన శంకర్, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన జన్ను భద్రయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మరణించాడు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ చైర్ పర్సన్ గండ్ర జ్యోతి ఆదేశాల మేరకు శనివారం ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ సందర్శించి భద్రయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట మాజీ ఉపసర్పంచ్ అట్ల తిరుపతి, సీనియర్ నాయకులు మేకల వెంకన్న, అట్ల రమేష్, కర్రు రవీందర్, పసునూటి రాజయ్య, శంకర్, ప్రశాంత్, విష్ణు, ఆనందం పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి కడియం పరామర్శ



నవతెలంగాణ-ధర్మసాగర్

మండలంలోని తాటికాయల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నీరు సారయ్య అనారోగ్యం తో మరణించడం జరిగింది. శనివారం ఆయన మృతదేహానికి పూల మాల వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబ సభ్యులను స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పరామర్శించారు. ఈ పరామర్శలో ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

నవతెలంగాణ-శాయంపేట

శాయంపేటలోని శ్రీ మ త్స్యగిరి స్వామి ఆలయ ఆవర ణలో గల హనుమాన్ మంది రంలో, శ్రీ శివ మార్కండేయ ఆలయ ప్రాంగణంలోని పం చముఖ ఆంజనేయ ఆలయంలో శనివారం హనుమాన్ జ యంతిని పురస్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చ కులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, మార్తా రాజ్ కుమార్ పంచామత అభిషే కాలు నిర్వహించి, చందనం వేశారు. శివ మార్కండేయ ఆలయంలో హను మత్ కవచస్తోత్ర పారాయణ సహిత హెూమాన్ని నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ : హనుమాన్ జయంతిని పురస్కరించుకొని ఆత్మకూరు మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో నెలకొని ఉన్న భక్తాంజనేయ స్వామి కి చందనం సమర్పించారు. శనివారం ఆంజనేయుని తిరునక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల మాధవ మూర్తి ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ చార్యులు మాధవ్‌మూర్తి మాట్లాడుతూ వైశాఖ బహుళ దశమిని రోజున హనుమాన్ జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా జరుగుతాయన్నారు.

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్ అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహిళా, పిల్లల, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ జనగామ జిల్లా అధికారి జెట్టి జయంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడలు, సామాజిక సేవా, సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం, కళలు, సంస్కృతి తదితర రంగాలలో ప్రతిభ కనబరిచిన 5 నుండి 18 ఏళ్లలోపు బాలబాలికలకు 2024 సంవత్సరానికి ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కారాలను భారత ప్రభుత్వం ప్రధానం చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు జులై 31 లోపు తమకు చేరాలని, మరిన్ని వివరాలకు జిల్లా సంక్షేమ అధికార్యాలయము, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, బాల రక్షాబంధన్ గ్రౌండ్ ఫ్లోర్ కలెక్టరేట్లోని జి-6 రూమ్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో...

రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఆదివారం జనగామ జిల్లాలో ప్రతి గ్రామ గ్రామాన, ప్రతి మండల కేంద్రంలో జాతీయ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టి అనంతరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆత్మ బలిదానం చేసుకున్న అమరవీరులకు నివాళులు అర్పించాలని జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ, మండలాధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ పాల్గొని తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మకు ధన్యవాదాలు తెలియజేయాలని కోరారు.

తెలంగాణ గీతంపై పునరాలోచన చేయాలి

- తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఏదునూరి వీరన్న



నవతెలంగాణ-లింగాలఘనపురం

తెలంగాణ గీతంపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచన చేయాలని తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎదునూరి వీరన్న అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏదునూరి వీరన్న తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ తల్లిగా ఊహ బొమ్మను పెట్టడం కాదు తెలంగాణ సంస్కృతికి తగ్గట్టుగా వీరనారి చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా పెట్టాలని అన్నవారు నేడు తెలంగాణ గీతంలో చాకలి ఐలమ్మ పేరు పెట్టడం గురించి ఎందుకు ఆలోచన చేయలేదో, జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ పేరు గురించి ఏ సభల్లో మాట్లాడకపోవడం యావత్తు రజక సమాజానికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర గీతంలో చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలను పెట్టకుండా వివక్షతకు గురిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ 2న విడుదల చేస్తున్న తెలంగాణ రాష్ట్ర గీతంలోనీ ఆరవ చరణంలో కొంత మంది వీరుల పేర్లు మాత్రమే పెట్టి, ఘన చరితుల్ని విస్మరించడం నూతన ప్రభుత్వానికి సబబు కాదని, తెలంగాణ ప్రభుత్వం రజక సమాజానికి ఇస్తున్న గౌరవం ఇదేనా అని ఆవేదన వ్యక్తం చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

నవతెలంగాణ-లింగాలగణపురం



మండల కేంద్రానికి చెందిన డిగ్రీ విద్యార్థి గట్టగల్ల కరుణాకర్ ఇటీవల మృతి చెందారు. శనివారం వారియొక్క కుటుంబానికి మనో ధైర్యం ఇస్తూ బీఆర్ఎస్ నాయకులు ఎడ్ల రాజు 50 కిలో బియ్యం అందజేశారు. భవిష్యత్తులో కూడా తన సహాయం వారి కుటుంబానికి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల శ్రీనివాస్, బెజ్జం అశోక్, ఎడ్ల జంపి, బోయిని నాగరాజు, బర్రె రామనర్సయ్య, మహేందర్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కొడకండ్ల



మండలంలోని గన్నితండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధారావత్ సురేష్ నాయక్ తల్లి కాంతమ్మ అనారోగ్యంతో మృతిచెందగా పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం పార్టీ మండలాధ్యక్షుడు సురేష్ ఆమె మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆ కుటుంబానికి వెన్ను దండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామాధ్యక్షుడు సుధీర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు హేమాని కిషన్, సోమన్న సోమని తదితరులు పాల్గొన్నారు.

బాలాజీ నగర్‌లో హనుమాన్ జయంతి


నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



స్థానిక బాలాజీ నగర్ మూడవ వార్డులో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ గుడిలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి. ఆంజనేయస్వామికి పంచామృతాలతో వివిధ ఫల రస, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. హనుమంతుని బలం, అసమానమైన భక్తి, నిస్వార్థమైన సేవకు ప్రతీకా అని, హనుమంతుని జయంతి ఆనందం, సామరస్యం, శ్రేయస్సు కలుగుతాయని జీవితంలో ప్రతికూలతల నుండి కాపాడడానికి ఆయన అడుగుజాడలు మనతో ఎల్లప్పుడూ ఉండాలని వేడుకున్నారు. మహిళా భక్తులు భక్తిపారవశ్యంతో హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో లగిశెట్టి పద్మావతి, దూడల శోభారాణి, మాదరపు కల్పన, దోసపాటి శ్రీలక్ష్మి, భాగ్య, జ్యోతి, స్వాతి, లోనే మంజుల, బొడ్డు లక్ష్మి, ఆలేటి పద్మ, మంగ మమత, టీ.విజయ, ఎనగందుల రేణుక , పావని, దూడల రమేష్, దోసపాటి శ్రీనివాస్, కృష్ణమూర్తి, కిరణ్, మాదారపు సత్యనారాయణ, గట్టు విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ హనుమాన్ జయంతి

నవతెలంగాణ-లింగాలఘనపురం



మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో శ్రీ హనుమాన్ జయంతి వేడుకలు శనివారం అంగరంగవైభవంగా ఘనంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ దీక్ష భక్తులు 41రోజులు మండల దీక్ష చేపట్టి జయంతి సందర్భంగా మాల విరమణకు ఇరిముడ్డి కట్టుకొని స్వామి వారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలవిరమణకు వేళ్లుతున్న దీక్ష భక్తులకు గ్రామ ప్రజలు నీళ్ల పోసి సాగనంపారు. అన్ని గ్రామాల్లో శ్రీ హనుమాన్ దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

సోమేశ్వర ఆలయంలో....

నవతెలంగాణ-పాలకుర్తి



పుణ్యక్షేత్రం శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవంలో భాగంగా సోమేశ్వర ఆలయంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, మూల విరాట్‌కి పంచామృత చందన అభిషేకములు, స్వామివారికి తమలపాకులు పుష్పాలంకర, వడ మాలతో అష్టోత్తర అర్చన ఉత్సవ మూర్తికి విశేష అభిషేకములు, మన్యు సూక్త విధాన మూలమంత్ర హవనము, పూర్ణాహుతి నీరాజన మంత్ర పుష్పములు తీర్థ ప్రసాద వితరణ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో భాగం లక్ష్మీప్రసన్న, ఆలయ అర్చకులు డివిఆర్ శర్మ, మత్తగజం నాగరాజు శర్మ ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అవతరణ దినోత్సవ వేడుకల ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

నవతెలంగాణ-జనగామ కలెక్టరేట్



సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జిల్లా అధికారులతో రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హైదరాబాదులోని పరేడ్ గ్రౌండ్స్‌లో అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారుల గౌరవార్థం సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నందున జనగామ జిల్లా నుంచి 16 మంది అమరవీరుల కుటుంబాలను 5 వాహనాల్లో తీసుకెళ్ళనున్నట్లు తెలిపారు. అదే విధంగా 102 మంది ఉద్యమకారులు, వారి కుటుంబాలను 2 ఏసీ బస్సుల్లో, ఉదయం 6 గంటలకు బయలుదేరనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఉన్న అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులు అవతరణ వేడుకల్లో పాల్గొనే విధంగా ప్రత్యేకంగా ఆహ్వానించాలని, ఆశాలు, ఏపీఎంలు, డీపీఎంలు, ఆరోగ్య సహాయకులు, అధికారులను నియమించి, వారితో పంపాలని సూచించారు. తాగునీరు, ఫుడ్, తదితర అన్ని ఏర్పాట్లతో అత్యంత జాగ్రత్తగా వారిని తీసుకెళ్ళి, తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఉదయం 9 గంటలలోపు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాను ఆవిష్కరించాలని సూచించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించాలని పేర్కొన్నారు. ఎటువంటి నిర్లక్ష్యం తగదని, గ్రామ పంచాయతీలలో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు జాతీయ జెండాను ఎగురవేయాలని వివరించారు. సమీకృత కలెక్టరేట్‌లో ఉదయం 9 గంటలకు జాతీయ పతాక ఆవిష్కరణ ఉంటుందని తెలిపారు. అంతకుముందు సమీకృత కలెక్టరేట్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో చేయాల్సిన ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్, ఏసీపీ అంకిత్ కుమార్ శంఖ్వార్‌లతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కార్యాలయ ఆవరణలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వేడుకలను అట్టహాసంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని, కుర్చీల ఏర్పాటుతో పాటు నీడ కోసం టెంట్లు, స్టేజ్, అలంకరణ, తదితర అంశాలను పరిశీలించి, అధికారులకు తగిన సూచనలు చేశారు. ఈ సమీక్షలో జెడ్పీ సీఈవో అనిల్ కుమార్, డీఈఓ రాము, డీపీఓ వినోద్ కుమార్, డీసీఎస్ఓ రోజా రాణి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలను... సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్

వెంటనే అమలు చేయాలి



నవతెలంగాణ-స్టేషన్‌ఘనపూర్

కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలకు ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రి ప్రసాద్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐ కన్వెన్షన్ హాల్లో సీపీఎం ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి శిక్షణ తరగతులు నేటికీ రెండు రోజు చేరుకున్నాయి. శిక్షణ తరగతులకు సీపీఎం మండల కార్యదర్శి మునిగేల రమేష్ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించగా ముఖ్యఅతిథిగా బుర్రి ప్రసాద్ హాజరై పార్టీ పని పద్ధతులు ప్రజాసంఘాల నిర్మాణం అనే అంశంపై క్లాస్ బోధించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ప్రధానమైన రైతు రుణమాఫీ నేటికీ అమలు కాలేదు అన్నారు. ఏకకాలంలో రైతు రుణమాఫీని అమలు చేసి రైతులకు వెంటనే రుణాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. అలాగే రైతులకు ఎరువుల బస్తాలు దొరకక భారీగా క్యూలైన్లో నిలబడి అనేక ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ సీజన్ ప్రారంభంలో ఉన్నందున ఎరువుల, విత్తనాల కొరత లేకుండా ప్రభుత్వం చూడాలని వారు కోరారు. మహిళలకు 2500 రూపాయలు ఇస్తానని ఇచ్చిన వాగ్దానం నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. వెంటనే 500 రూపాయల గ్యాస్ పథకాన్ని అమలు చేయాలని, అలాగే విద్యా సంవత్సరం ప్రారంభం అయినందున ప్రైవేట్ విద్యా సంస్థలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని, దీనివల్ల పేద విద్యార్థులు చదువు అందని ద్రాక్షగా మిగిలిపోయే ప్రమాదం ఉన్నందున ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ శిక్షణ తరగతులలో పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న అమానవీయ దాడులను ఖండించాలని సీపీఎం తీర్మానం చేశారు.

ఈ తీర్మానాన్ని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సాంబరాజు యాదగిరి ప్రవేశపెట్టగా అందరు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు ఇర్రి అహల్య, రాపర్తి రాజు, సింగారం రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, జోగు ప్రకాష్, సుంచు విజేందర్, పోత్కనూరి ఉపేందర్, కోడెపాక యాకయ్య, బోడ నరేందర్, ఎండి షబానా, బెల్లంకొండ వెంకటేష్, పొదల నాగరాజు, మండల కార్యదర్శిలు గంగాపురం మహేందర్, మాచర్ల సారయ్య, సాదం రమేష్, గట్ల మల్లారెడ్డి, గుండెబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చోడి చేతిలో రాయిలా... రేవంత్ రెడ్డి పాలన

- అభివృద్ధిపై చిత్త శుద్ధి నిరూపించుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నవతెలంగాణ-లింగాలగణపురం



తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన పిచ్చోడి చేతిలో రాయలా సీఎం రేవంత్ రెడ్డి పాలన ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. శనివారం మండలంలోని కళ్లెం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర రాజముద్రను మార్చడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర గీతాన్ని మార్చడంపై ఆంధ్ర సంగీతం దర్శకులను తీసుకోవడం తెలంగాణ సంగీత దర్శకులను అగౌరవ పరచడమే అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో అమరవీరులను గుర్తించకపోవడం విచారకరమన్నారు. మార్పు పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను అభివృద్ధిని గాలికి వదిలేసి పనికిమాలిన వ్యవహారాలు చేస్తుందని ఆరోపించారు. స్టేషన్‌ఘన్పూర్ అభివృద్ధి పేరు చెప్పుకొని కాంగ్రెస్‌లో చేరిన దళిత ద్రోహి కడియం శ్రీహరి గత ప్రభుత్వంలో నియోజకవర్గానికి మంజూరు చేసిన పలు అభివృద్ధి సంక్షేమ పనులను పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హితువు పలికారు. లేనిచో దమ్ము ధైర్యం ఉంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీలో నిలవాలని నియోజకవర్గ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఎంతోమంది నిపుణులతో మేధావులు సమక్షంలో ఏర్పాటు చేసుకున్న తెలంగాణ రాజముద్రను మార్చడం అవివేకం అన్నారు. తెలంగాణ ప్రాంత సంప్రదాయాలకు సాహిత్యానికి దేశ చరిత్రలోనే చార్మినార్, కాకతీయ తోరణానికి గొప్ప గుర్తింపు అన్నారు. ఈ సమావేశంలో మండలాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లాదిశ కమిటీ సభ్యురాలు భాగ్యలక్ష్మి,మబ్బు కరుణాకర్, ఆదాం అబ్రహం, శ్రీహరి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్..!

- ఆరంభంలోనే అందించేలా కసరత్తు
- ఈ ఏడాది కూడా రాత పుస్తకాల పంపిణీ
- తగ్గనున్న తల్లిదండ్రుల ఆర్థిక భారం

నవతెలంగాణ-పెద్దవంగర



సర్కారు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే పాఠ్యపుస్తకాలు మండలానికి చేరాయి. 2024-25 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలల ఆరంభంలోనే విద్యార్థులకు సకాలంలో అందించేలా అధికారులు చర్యలు చేపట్టారు. మండల వ్యాప్తంగా మొత్తం 30 ప్రభుత్వ పాఠశాలలు (కేజీబీవీ, టీఎస్ఎంజేపీటీబీసీ గురుకుల పాఠశాల)తో కలిపి ఉన్నాయి. వీటిలో ఒకటో తరగతి నుండి పదవ తరగతి వరకు దాదాపుగా 1997 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఈనెల 12న పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. గత రెండు రోజుల క్రితమే 5,222 పాఠ్యపుస్తకాలు మండల విద్యా వనరుల కేంద్రానికి చేరుకున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన మొదటి రోజే పుస్తకాలు అందించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

ఇంకా రావాల్సిన పుస్తకాలు..

మండలానికి మొదటి విడతగా 5,222 పుస్తకాలు వచ్చాయి. ఇంకా తొమ్మిది టైటిల్ పుస్తకాలు రావాల్సి ఉంది. వాటిలో రెండవ తరగతి తెలుగు టైటిల్, ఆరవ తరగతి ఇంగ్లిష్ టైటిల్, ఏడవ తరగతి ఇంగ్లిష్, ఎనిమిదో తరగతి తెలుగు, ఇంగ్లిష్ టైటిల్, తొమ్మిదవ తరగతి హిందీ, బయోలాజికల్ సైన్స్ టైటిల్, పదో తరగతి హిందీ, ఇంగ్లిష్ టైటిల్స్ రావాల్సి ఉంది. ఇంకా రావాల్సిన పుస్తకాలు రెండో విడతలో రానున్నాయి. వీటి సరఫరా కోసం కూడా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు.

పుస్తకాలతో పాటు రాత పుస్తకాలు కూడా..

రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది నుండి సర్కారు పాఠశాలలో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలతో పాటుగా, రాత పుస్తకాలను కూడా అందజేస్తుంది. అందులో భాగంగానే ఈ ఏడాది మండలానికి మొత్తం 8,922 రాత పుస్తకాలు వచ్చాయి. వీటిలో వైట్ రాత పుస్తకాలు 6,469, సింగిల్ రోల్ రాత పుస్తకాలు 2,453 ఉన్నాయి. గతేడాది 6,7 తరగతుల విద్యార్థులకు 6, 8వ తరగతి విద్యార్థులకు 7 రాత పుస్తకాలు, 9,10వ తరగతి విద్యార్థులకు 14 రాత పుస్తకాలు ఇచ్చారు. ఈ ఏడాది కూడా విద్యార్థులకు సరిపడా రాత పుస్తకాలు పంపిణీ చేయనున్నారు. ప్రభుత్వమే విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ చేస్తుండడం వల్ల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ మరింత పెరిగే అవకాశం ఉంది.

మొదటి రోజే పుస్తకాలు పంపిణీ : కళాధర్, ఎంఎన్ఓ, పెద్దవంగర



విద్యార్థులకు ఆరంభంలోనే పాఠ్యపుస్తకాలు అందజేయడం వల్ల ఒత్తిడి ఉండదు. ఈ విద్యాసంవత్సరంలో పుస్తకాలను సకాలంలో పంపిణీ చేయడానికి అన్ని చర్యలు చేపట్టాం. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన మొదటి రోజే పుస్తకాలు అందజేస్తాం. పుస్తకాలు పక్కదారి పట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.



తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన ప్రభుత్వ కార్యాలయాలు - విద్యుత్ దీపాల ఏర్పాట్లు

నవతెలంగాణ-పాలకుర్తి

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశారు. జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే దశాబ్ది ఉత్సవాలకు ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పాఠశాలలను విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసి ముస్తాబు చేశారు.తెలంగాణ ప్రజల ఆకాంక్షను తీర్చేందుకు 2014లో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణను ప్రకటించడంతో తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని జూన్ రెండున రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాల ముందు వివరణ పతకాలను ఎగురవేస్తారు. మండల కేంద్రంలో గల తహసిల్దార్ కార్యాలయంతో పాటు ఎంపీడీవో కార్యాలయం, పోలీస్‌స్టేషన్, ఐలమ్మ మార్కెట్ కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలలను ముస్తాబు చేశారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గిరగాని కుమారస్వామి గౌడ్ ప్రజలను కోరారు.



భూవివాదంపై డీసీపీ సీతారాం విచారణ

నవతెలంగాణ-బచ్చన్నపేట

మండలంలోని పోచన్నపేట గ్రామంలో సర్వే నంబర్ 422, 423లలో 26 ఎకరాల మేరకు ఎస్సీలకు చెందిన వారసత్వపు భూవివాదంపై డీసీపీ సీతారాం క్షేత్రస్థాయి విచారణ జరిపారు. ఈ సందర్భంగా శ్రీపతి లక్ష్మి భర్త మల్లయ్య ఫిర్యాదు చేయగా ఇందులో గల ఎస్సీల వద్ద నుండి 6 ఎకరాల మేరకు బి.సత్యనారాయణ కొనుగోలు చేశారు. ఇందులో భూ విక్రయ దారులు, పొజిషన్‌లో ఉన్న 20 మంది రైతులు విచారణకు హాజరయ్యారు. జరిగిన భూ వివాదంపై ఇంతకుముందు అమ్ముకున్న క్రయవిక్రయాలపై క్షేత్రస్థాయిలో పొజిషన్‌లో ఉన్న వారిని చుట్టుపక్కల రైతులను ఒక్కొక్కరిని పిలుచుకొని జరిగిన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఇట్టి సమస్యను మూడు రోజుల్లో పరిష్కరింప జేస్తామని అంతవరకు ఎవరి పొజిషన్ డిస్టబెన్స్ చేయకుండా వివాదాలకు దారి తీయకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై కంకల సతీష్ కుమార్, పోలీస్ సిబ్బంది జమాలోద్దీన్, అనీల్ కుమార్, రైతులు సీపతి నారాయణ, సీపతి ప్రభాకర్, సీపతి నరసింహులు, మల్లయ్య, రమేష్, జంజాల యాదయ్య, సీపతి సౌందర్య, రేణుక, జంజాల వెంకటయ్య, సీపతి సుధాకర్ పలువురు పాల్గొన్నారు.

ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడిగా కీమా నాయక్

నవతెలంగాణ-జఫర్‌గడ్



మండలంలోని రేగడి తండా గ్రామపంచాయతీ పరిధిలోని కేజీ తండాకు చెందిన భూక్య కీమా నాయక్‌ను కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు నునావత్ సుమన్ నాయక్ శనివారం ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా కీమా నాయక్ మాట్లాడుతూ నా ఎన్నికకు సహకరించిన కాంగ్రెస్ స్టేషన్‌ఘన్పూర్ ఇన్చార్జ్ సింగపురం ఇందిర, ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మండల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నవతెలంగాణ-జనగామ



అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జనగామ పట్టణంలోని రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా నాయిని ప్రకాష్ స్వరూప, కుమారుడు నాయిని రోహిత్‌లు వృద్ధులకు అన్నదానం చేశారు. అమ్మ ఫౌండేషన్ ప్రతినిధి సల్ల మహేష్, బింగి నరసింహులు, అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు మాట్లాడుతూ ఆకలితో అలమటిస్తున్న వృద్ధులకు ఒక పూట ఆకలి తీర్చడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరు సందర్భం ఏదైనా కానీ నిలువ నీడలే నిరాశ్రయులకు ఒక పూట ఆకలిని తీర్చి జరుపుకోవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు. భారతదేశంలో ఆకలి చావులు లేకుండా నియంత్రణ లక్ష్యంగా ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

సాగుకు సిద్ధమవుతున్న రైతన్నలు

నవతెలంగాణ-ఇనుగుర్తి



వానాకాలం సీజన్ ఆరంభం కావడంతో అన్నదాతలు పంటల సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. రోహిణి కార్తె ప్రారంభం కాగా.. ఈ సమయం పత్తి పంట సాగుకు సరైనదని భావించి రైతులు ఇటీవల ఓ మోస్తారు వర్షం కురవడంతో పొలాలను ట్రాక్టర్ల సాయంతో చదును చేసి సిద్ధంగా ఉంచుతున్నారు. కొందరు మాత్రం ఇప్పటికే విత్తనాలను పొడి దుక్కిలో నాటుతున్నారు. విత్తనాలు మొలకెత్తేంతా తేమ భూమిలో లేకపోయినప్పటికీ.. వర్షం పడితే కూలీల కొరత ఏర్పడి విత్తనాలు నాటడం కష్ట మవుతుందని కొందరు ముందస్తుగా పొడి దుక్కిలో విత్తుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సరైన వాన కురిసిన తర్వాతనే పత్తి విత్తనాలు నాటుకోవాలని సూచిస్తున్న కూలీల ఖర్చును అధిగమించేందుకు ఇలా చేస్తున్నామని రైతులు చెబుతున్నారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు

నవతెలంగాణ-మరిపెడ



ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్ఎఫ్ఐ కన్వీనర్ పట్ల మధు డిమాండ్ ఒక ప్రకటనలో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిపెడ ప్రవేటు పాఠశాలలో ఇష్టారీతిగా ఫీజుల పెంచుతున్న అధికారులు నోరు మెదపడం లేదని, అధికారులు మొద్దు నిద్ర విడాలని, మమూళ్ల మత్తులో మునిగిపోతున్నారని మధు ఆరోపించారు.అలాగే ఫీజుల ఇష్టారీతిగా పెంచి, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చెస్తున్నారని ఎస్ఎఫ్ఐ సర్వేలో తేలిందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో బుక్స్, యూనిఫాంను యాజమాన్యం ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని విమర్శించారు. ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న ప్రైవేట్ పాఠశాలల పై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.



బాలింతరాలి మృతిపై విచారణ

- జిల్లా డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అంబరీష

నవతెలంగాణ-ఇనుగుర్తి

ఇనుగుర్తి పిహెచ్సి పరిధిలోని అమీనాపురం ప్రాంతానికి చెందిన బాలింతరాలు మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో 6 నెలల క్రితం మృతి చెందిన సంఘటనపై మహబూబాబాద్ డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ అంబరీష శనివారం విచారణ జరిపారు. ఈమేరకు ఇనుగుర్తి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సురేష్, హెచ్ఈఓ, ఎమ్మెల్ హెచ్పి, ఏఎన్ఎం, ఆశాలతో కలిసి బాధితుల ఇంటికి వెళ్లి జరిగిన సంఘటనపై కుటుంబ సభ్యులతో మాట్లాడి విచారించారు.అక్కడే జరుగుతున్న రొటీన్ ఇమ్యూనైజేషన్ సెషన్‌ని పర్యవేక్షించారు. ఆ తరువాత సబ్ సెంటర్ ఇనుగుర్తి, అంగన్వాడీ సెంటర్ 4లో జరుగుతున్న రొటీన్ ఇమ్యూనైజేషన్ సెషన్‌ని సందర్శించి రికార్డ్స్‌ని తనిఖీ చేసి ఏఎన్ఎమ్, ఆశ కార్యకర్తలతో కలిసి గృహ సందర్శన చేశారు. ఆ తరువాత పిహెచ్సి ఇనుగుర్తిని సందర్శించి ప్రతి గర్భిణీ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం పొందేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. అన్నీ జాతీయ వైద్య కార్యక్రమాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని కోరారు. రానున్న వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ అంబరీష, సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, సిహెచ్ఓ కృష్ణార్జున, పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ సురేష్, సూపర్ వైజింగ్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షులుగా అనంతగిరి వెంకన్న

నవతెలంగాణ-మరిపెడ



మండల రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులుగా అబ్బాయిపాలెం గ్రామానికి చెందిన అనంతగిరి వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా భూక్య వెంకన్న కార్యదర్శిగా గంధం భద్రయ్య, కోశాధికారిగా వీరగాని ఉపేందర్, గౌరవ సలహాదారులుగా టీ.ఉపేందర్, ఎస్.కె అబిబుద్దిన్, భూక్య శ్రీనివాస్, గుగులోతు వసంత రెడ్డి, చందా వెంకన్న కార్యవర్గ సభ్యులుగా బద్రు, గంధసిరి ఉపేందర్, గోపగాని హిమబిందు, టి.సంతోష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు అనంతగిరి వెంకన్న మాట్లాడుతూ నాపై నమ్మకంతో నాకు అధ్యక్ష పదవికి అవకాశం కల్పించిన రేషన్ డీలర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోర మల్లయ్య, అనంతగిరి శ్రీనివాస్, రాములు, భూక్య కిషన్ నాయక్, దాసు, రూప్ల, నరసింహారావు, ఎల్.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అభివృద్ధికి లక్ష రూపాయల విరాళం

నవతెలంగాణ-బయ్యారం

తాను పుట్టి పెరిగిన తండా అభివృద్ధికి తన వంతు సహాయంగా తండాలో ఆలయ అభివృద్ధి కొరకు కాంగ్రెస్ జిల్లా లీగల్ అడ్వైజర్, మాజీ ఎంపీపీ గుగులోత్ కిషన్ నాయక్ లక్ష రూపాయలు విరాళం అందజేశారు. అతి చిన్న తండాలో పుట్టి ఎన్నో ఒడిదోడుగులను ఎదుర్కొని రాజకీయ ప్రవేశం చేసి బయ్యారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా, బయ్యారం మండల ఎంపీపీగా పని చేసి మంచి పేరు సంపాదించుకొని ఉన్నత చదువులు చదువుకొని హైకోర్టు అడ్వకేట్‌గా విధులు నిర్వహిస్తూ, ఆలయ అభివృద్ధికి రూ. 1,00,016లను విరాళంగా శనివారం గ్రామస్తులకు అందజేశారు.

హనుమాన్ దేవాలయానికి...

నవతెలంగాణ-తొర్రూర్ రూరల్



హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం తొర్రూరు మండలంలోని జీకే తండాలో నూతనంగా ప్రతిష్ఠించిన హనుమాన్ దేవాలయానికి అమ్మాపురం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముద్దం మహబూబ్ రెడ్డి రూ. 10,116 విరాళంగా అందజేశారు. అనంతరం తండా పెద్దలు శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమాన్ దేవాలయానికి తన వంతు విరాళం అందించడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. హనుమంతుని ఆశీస్సులతో ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు భానోత్ సోమ్లా, నర్సింహ, శ్రీను, మంగ్యా అజ్మీర వీరన్న, సురేష్, గుగులోత్ నాగరాజు, జగన్, ఈట, రాన్న తదితరులు పాల్గొన్నారు.

పెయింటర్ కుటుంబానికి ఆర్థిక సహాయం


నవతెలంగాణ-మహబూబాబాద్



ప్రమాదంలో కాలు, చేయి కోల్పోయిన పెయింటర్ కోట వెంకటాద్రి కుటుంబానికి సహా పెయింటర్లు నగదు, బియ్యం అందజేశారు. శనివారం మానుకోట సీపీఐ కార్యాలయంలో సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పెయింటర్ల సంఘం మండలాధ్యక్షులు బోడ రవి, కార్యదర్శి గులగట్టు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు భామండ్ల శేఖర్, గౌరవాధ్యక్షులు మంద శంకర్, ముఖ్య సలహాదారులు మారగాని రవి, బానోతు మున్న, ఎస్కె మహిమూద్,బానోతుబాబు, సురేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

సంపులో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-మరిపెడ



మండలంలోని చిల్లంచర్ల గ్రామంలో దొంతు లక్ష్మీ నర్సు (48) శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు సంపులో పడి మృతి చెందారు. మరిపెడ ఆదనపు ఎస్సై గండ్ర సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం దొంతు లక్ష్మీ నర్సు భార్య విడాకులు ఇచ్చి తల్లి ఇంటి వద్ద ఉంటుంది. ఒంటరి జీవితాన్ని అనుభవిస్తున్న ఆయన మద్యం సేవించినట్టు సమాచారం. శుక్రవారం రాత్రి నీళ్ల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు సంపులో పడ్డారు. శనివారం నీళ్ల కోసమని పక్కింటి వారు వెళ్లగా బావిలో తలకిందులై మృతి చెంది మృత్యువాతకు గురై ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మహబూబాబాద్‌కు తరలించారు.

రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు
- మనగ్రోమోర్ తనిఖీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- గుడుంబా అరికట్టాలని ఎమ్మెల్యేకు మహిళలు వినతి

నవతెలంగాణ-పెద్దవంగర

విత్తనాల కొనుగోలు నుండి,ధాన్యం అమ్మకాల వరకు రాష్ట్ర రైతాంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని మనగ్రోమోర్ సెంటర్‌ను ఎమ్మెల్యే ఆకస్మికంగా సందర్శించారు. ఎరువులు, ఫర్టిలైజర్స్ అమ్మకాల వివరాలు, బిల్ బుక్, స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ఆయా కంపెనీల విత్తనాల ప్యాకెట్ పై గల గడువు తేదీని పరిశీలించి, దుకాణ నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్‌లో రైతులు సాగు చేయబోయే పంటలకు నాణ్యమైన విత్తనాలను అందించాలన్నారు. విత్తనాల మొలక శాతం పరిశీలించిన తరువాతే రైతులకు ఇవ్వాలన్నారు. దుకాణ యజమానులు తప్పనిసరిగా ఎమ్మార్పీ ధరల పట్టిక ఉంచాలని, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని, లైసెన్సులు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. విత్తన డీలర్లు విధిగా షాపు యొక్క పేరు, డోర్ నెంబర్ కనిపించే విధంగా పెట్టాలన్నారు. విత్తనాలు, ఫర్టిలైజర్స్ విక్రయాల్లో రైతులకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించబోమన్నారు. గ్రామాల్లో ఎవైనా సమస్యలు ఉంటే నేరుగా నా దృష్టికి తీసుకురావాలన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉండడం వల్ల నియోజకవర్గంలో కొన్ని అభివృద్ధి, సంక్షేమ పనులు చేయలేకపోతున్నామని, కోడ్ ముగియగానే శరవేగంగా అభివృద్ధి పనులు చేపడుతామని చెప్పారు. కాగా ఎమ్మెల్యే మనగ్రోమోర్ తనిఖీలో సంబంధిత అధికారులు లేకపోవడం గమనార్హం. ఎమ్మెల్యే వచ్చిన కూడా అధికారులు రాకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



గుడుంబా అరికట్టాలని ఎమ్మెల్యేకు వినతి...

మండలంలోని అన్ని గ్రామాలు, తండాల్లో గుడుంబా ఏరులై పారుతుందని, ఎక్సైజ్ పోలీసులు కనీసం గ్రామాల వైపు కన్నెత్తి చూడలేదని, కూలీ పనులు మానేసి తమ భర్తలు తాగుడు బానిసై, తమను చిత్రహింసలు పెడుతున్నారని స్థానిక మహిళలు ఎమ్మెల్యే ముందు కన్నీటి పర్యంతం అయ్యారు. గుడుంబా నిర్మూలనకు కృషి చేయాలని మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో గుడుంబా అరికట్టడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముద్దసాని సురేష్, మండల ఉపాధ్యక్షుడు రంగు మురళిగౌడ్, మండల కాంగ్రెస్ సీనియర్ నాయకులు దుంపల కుమారస్వామి, సంకేపల్లి రవీందర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు అనపురం శ్రీనివాస్, గ్రామాధ్యక్షుడు గద్దల ఉప్పలయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఓరిగంటి సతీష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎండీ జానీ, పన్నీరు వేణు, శ్రీరామ్ జగదీష్, జాటోత్ వెంకన్న, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఆవుల మహేష్, వినోద్, చిలుక సంపత్, పంతులు నాయక్, రామ్‌చరణ్, పవన్, దంతాలపల్లి ఉపేందర్, మనగ్రోమోర్ మేనేజర్ సురేష్, ఫీల్డ్ ఆఫీసర్ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

'బడిబాట'ను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-మరిపెడ

మండలంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలని మండలస్పెషల్ ఆఫీసర్ టి.సుధాకర్ పిలుపునిచ్చారు. జూన్ 3 నుండి 19 వరకు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం మరిపెడ మండల కేంద్రంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంల ప్రభుత్వ అధికారుల సమన్వయ సమావేశం జరిగింది. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా తహసిల్దార్‌డి.సైదులు, ఎంపీడీవో జీ.రేవతితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు పెంచేందుకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జూన్ 3 నుండి 19 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాల బడిబాట నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరారు. గ్రామంలో ఉన్న ప్రతి ప్రభుత్వఉద్యోగి, యువజన సంఘాలు, డ్వాక్రా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు బడిబాటలో భాగస్వామ్యం కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు ఆయన తెలిపారు. బడి ఈడు పిల్లల్ని బడిలో చేర్పించాలని డ్రాప్ వుట్ లేకుండా చూడాలని ఆయన కోరారు. ఈ క్యాంపియన్లు ఎవరు నిర్లక్ష్యం చేసిన సహించేది లేదన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

మరిపెడ మండలంలో అమ్మ ఆదర్శ పాఠశాలలకు 28 పాఠశాలలను ఎంపిక చేసినట్లు స్పెషలాఫీసర్ టి.సుధాకర్ తెలిపారు. ఈ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు జూన్ 12 నాటికి గడువులోపు పూర్తి చేయాలని ఆయన హెచ్ఎంలు స్థానిక కమిటీలతో కోఆర్డినేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పూర్ణచందర్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గుగులోతు రవి, ఏపీఎం బానోతు రాముల నాయక్, నోడల్ అధికారి అనితా దేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అంగన్వాడి సూపర్వైజర్లు, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీ ఆర్పీలు, వివోలు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 3 నుండి 19 వరకు జరిగే బడి బాటలో స్వయం సహాయక సంఘాలు భాగస్వామ్యం కావాలని ఎంపీడీవో జి.రేవతి అన్నారు. శనివారం మండల సమైక్య కార్యాలయంలో మహిళా సంఘాల అధ్యక్షురాలు ఐకెపి సిబ్బందితో బడి బాటపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీవో జి.రేవతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడి మానేసి ఇంటి వద్ద ఉంటున్న అందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆమె కోరారు. అనంతరం ఏపీఎం రాములు మాట్లాడుతూ గ్రామాలలో గ్రామైక్య సంఘాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, కొంతమంది పైనుంచి వచ్చిన మెసేజ్‌లను సైతం పట్టించుకోవడం లేదని వారీ పద్ధతిని మార్చు కోవాలని ఆయన సీఏల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సిఎలు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎంఎస్ఓ అనితాదేవి, సీసీలు రుక్మిణి, మంగమ్మ, శ్రీనివాసు, చందులాల్, నాగిరెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు చందా కరుణ, కార్యదర్శి మాధవి, కోశాధికారి మాధవి, వివిధ గ్రామాల నుండి హాజరైన వివోలు, సీసీలు పాల్గొన్నారు.



మరిపెడలో...

తొర్రూర్ రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేసి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తొర్రూర్ ఎంపీడీవో సిలార్ సాహెబ్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్మన్లు, ప్రధానోపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, మరమ్మతుల పనులను త్వరగా పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అసౌకర్యాలకు గురికాకుండా చూసి అలాగే ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజునే విద్యార్థులకు యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు నోట్ పుస్తకాలు అందించాలని ఆయన కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మత్తులు ఇప్పటికే మూడు పాఠశాలలు పూర్తికాగా మిగిలినవి త్వరగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మహంకాళి బుచ్చయ్య, ఏపిఎం సంజీవరావు, ఏఈ అరుణ్ తేజ, ఎంపీఓ గౌస్, వివిధ పాఠశాలల చైర్మన్లు ప్రధానోపాధ్యాయులు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పెద్దవంగర : బడిబాట కార్యక్రమాన్ని సమన్వయంతో నడిపించాలని ఎంపీడీవో వేణుమాధవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉపాధ్యాయులతో పాటు మహిళా సంఘాలు, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటరీస్, అందరూ సమన్వయంతో బడిబాట విజయవంతం అయ్యేలా కృషి చేయాలన్నారు. ప్రభుత్వం పుస్తకాలు నోట్ బుక్‌లతో పాటు యూనిఫాం పంపిణీ చేస్తూ విద్యార్థులకు భోజన వసతి కల్పిస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని 15 రోజులపాటు వాడవాడన అవగాహన కల్పించి, విద్యార్థుల హాజరు శాతం ప్రైవేటు పాఠశాలల కన్నా ధీటుగా ఉండేలా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీఎం రమణాచారి, ఎంపీఓ సత్యనారాయణ, ఎంఎన్ఓ కళాధర్, చిట్యాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు విజయ్ కుమార్, సీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.



తొర్రూరు రూరల్‌లో...

నెల్లికుదురు : బడిబాటను జయప్రదం చేయాలని ఎంపీడీవో బాలరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో మండల విద్యాశాఖ ఐసిడిఎస్, ఐకెపి శాఖల సంయుక్తంగా బడిబాట సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల సౌకర్యాలు ప్రభుత్వ బడుల్లోనే ఉంటాయని, అందుకోసం ప్రతి ఒక్కరం గ్రామాలలో తిరిగి ప్రతి ఒక్కరి విధిగా ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ రామ్దాస్, ఎంపీఓ పార్థసారథి, ఏపిఎం వరదయ్య, మండల వైద్యాధికారి వంశీకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్లు మల్లీశ్వరి, నాగమణి, ఉషారాణితోపాటు వివిధపాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వివోఏలు, మండల ఎంఐఎస్ కోఆర్డినేటర్ ఎం. సుధాకర్, సిఆర్‌పిలు డి.రవి, బి.కవిత, జె.కవిత, బి.వీరస్వామి, కంప్యూటర్‌ఆపరేటర్ హెచ్.ఉపేందర్ పాల్గొన్నారు.

చిన్నగూడూరు :బడిబాటను కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో రామారావు అన్నారు. శనివారం బడిబాట కార్యక్రమం పై ఎంపీడీవో కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడం కోసం చేపట్టనున్న బడిబాటను గ్రామాల్లో విజయవంతం చేయాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ ప్రైవేటు పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత చదువులు చదివించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే ప్రవీణ్, మండల నోడల్ అధికారి రవికుమార్, ఎంపీఓ యాకయ్య, ఏపిఎం పాపయ్య,ఐసిడిఎస్ సూపర్వైజర్ కవిత, మాధవి, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దంతాలపల్లి : జూన్ 12న ప్రభుత్వ పాఠశాలలు పునప్రారంభం కానుండడంతో జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్లు, తహసిల్దార్, ఎంపీడీవో, ఎంఈఓ, ఐకెపి, అధికారులతో సమన్వయ కమిటీ అవగాహన కార్యక్రమం శనివారం జరిగినట్లు ఎంపీడీవో వివేక్రం తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ జూన్ 3 నుంచి 12 వరకు బడిబాట కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏం శ్రీదేవి, ఎంపీఓ అప్సర్ పాషా, ఏపీఎం దివాకర్ రాయి, ప్రధానోపాధ్యాయులు వేణు మాధవ్, మండల వైద్యాధికారి చైతన్య, సూపర్వైజర్ మహిళా సంఘ సభ్యులు వివోఏలు తదితరులు పాల్గొన్నారు.



మరిపెడలో...



పెద్దవంగరలో...



నెల్లికుదురులో...



చిన్నగూడురులో...

నకిలీ విత్తనాలను అరికట్టాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గునిగంటి రాజన్న

నవతెలంగాణ-మహబూబాబాద్

గత ప్రభుత్వం నకిలీ విత్తనాలు అరికట్టలేకనే రైతుల ఆత్మహత్యలు జరిగాయని, ఈ ప్రభుత్వం కూడా అలా చేయకుండా సమగ్రమైన విత్తన చట్టాన్ని తేవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గునిగంటి రాజన్న అన్నారు. శనివారం రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశం నల్లపు సుధాకర్, పాపారావు అధ్యక్షతన జరిగింది. జిల్లా కమిటీ అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా గునిగంటి రాజన్న మాట్లాడుతూ నకిలీ విత్తనాలు విక్రయిస్తున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అదే కాకుండా నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం విత్తనాల కంపెనీనే భరించాలని డిమాండ్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా రైతులు నకిలీ విత్తనాల ద్వారా నష్టపోయారని, అప్పుల పాలై అనేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని తెలిపారు. చాలామంది రైతులు వలస వెళ్లిపోయారని అన్నారు. రైతుల జీవితాలతో ఆటలాడుకుంటున్న నకిలీ విత్తన కంపెనీలను సీజ్ చేయాలని దాంతో పాటు పిడి యాక్ట్ నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులను దృష్టిలో పెట్టుకొని రైతులను ఆదుకునే విధంగా, సమగ్రమైన చట్టం తేవాలని అన్నారు. అదే విధంగా ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని, రైతులు రుణమాఫీ తక్షణమే చేయాలని, కౌలు రైతులను గుర్తించి రైతు భరోసా ఇవ్వాలని జిల్లా కమిటీలో చర్చించారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు మళ్లీడి కోటయ్య, ధరావత్ బుజ్జి, శ్రీను, పేరుమండ్ల పుల్లయ్యవెంకట్ రెడ్డి, బొబ్బ ఉపేందర్ రెడ్డి, బిక్షపతి, వీరన్న, వెంకన్న, ఇస్లావత్ జోగియా, పల్లా ప్రభాకర్ రెడ్డి, వీరభద్రం పాల్గొన్నారు.





ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలి

- స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఈసంపల్లి సైదులు

నవతెలంగాణ-నెల్లికుదురు

ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను తక్షణమే నియమించాలని తెలంగాణ స్కావెంజర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఈసంపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండల కేంద్రంలోని సమావేశ మందిరంలో ఎంపిడిఓ బాలరాజుకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలని, గ్రామ పంచాయతీలకు అప్పగించే విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. గత ఎన్నికల్లో ఇప్పుడున్న ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుద్ధ్య కార్మికులను నియమిస్తామని హామీ ఇవ్వడం వలన కొంత ఊరట ఇచ్చిందని దానిని తక్షణమే అమలు చేసి పాఠశాలల ప్రారంభం ముందే వారిని నియమకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్.వెంకన్న, ఐలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

నవతెలంగాణ-బయ్యారం

మండలంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం విశేష అభిషేక పూజలతో పాటు పంచకుండాత్మక హనుమాత్ కవచహవనం పూజలు, యజ్ఞాలను నిర్వహించారు. ఈ పూజలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలో ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు.

నెల్లికుదురు : మండలంలోని బ్రాహ్మణ కొత్తపల్ల గ్రామంలో ఆంజనేయస్వామి దీక్షలు 21 రోజు నిర్వహించి ఇరుముడి కట్టి శనివారం కొండగట్టు ఆంజనేయస్వామి వద్దకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా భక్తులు గ్రామంలోని మెయిన్ వీధుల గుండా వెళ్తున్న గ్రామంలో గ్రామ భక్తులు వారి కాళ్ల వద్ద నీళ్ళు పోసుకుంటూ నూతన కోరికలు కోరుకుంటూ భక్తజనులతో కలిసి బ్యాండ్ మేళాలతో కలిసి ఘనంగా ఊరేగించుకుంటూ వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయ స్వామి భక్తులు పాల్గొన్నారు.


'పెద్దవంగర'లో తాగునీటి అవస్థలు

నవతెలంగాణ-పెద్దవంగర



అస్సలే వేసవి కాలం, దీనికి తోడు బుక్కెడు తాగునీరు అందక పెద్దవంగర గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికే పెద్దదిక్కు మారిన పశువుల దావఖాన సమీపంలోని తాగునీటి బోరు గత పదిరోజుల క్రితం మరమ్మతుకు గురైంది. గతంలో మరమ్మతులు చేసిన, మళ్ళీ కూడా పని చేయకపోవడంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతో భగభగ మండే ఎండల్లో వ్యవసాయ బావులు, బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. మరో వైపు గ్రామంలోని డబుల్ బెడ్ రూం ఇండ్లకు సరిగా తాగడానికి మిషన్ భగీరథ నీళ్లు అందక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. మరికొన్ని గ్రామాల్లో వాటర్‌మెన్‌ల అలసత్వం కారణంగా తాగునీటి కోసం ప్రజలు తండ్లాడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని కోరుతున్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై మహేష్, తహశీల్దార్ మహేందర్, మండల వ్యవసాయాధికారి కుమార్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు విత్తన, ఎరువుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డీలర్ షాపు నందు స్టాక్ రికార్డులు, బిల్ బుక్కులు పరిశీలించారు. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తన డీలర్లకు విత్తనాలు పర్మిషన్ ఉన్న కంపెనీ నుంచి మాత్రమే తీసుకోవాలన్నారు.

సీడ్ లైసెన్స్ కొనుగోలు దారులకు కనిపించే విధంగా పెట్టాలని, ధరల పట్టిక రైతులకు కనిపించే విధంగా ఉంచాలన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేయరాదని హెచ్చరించారు. అదే విధంగా నిషేధిత బీటీ-3 విత్తనాలు ఎవరైనా అమ్మితే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ యశస్విని, ఎరువుల దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

నవతెలంగాణ-తొర్రూరు



తొర్రూరు మున్సిపల్ కేంద్రంలో పలు గ్రోమోర్, ఎరువుల షాపులను శనివారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ఆకస్మిక తనిఖీనిర్వహించారు. పలు దుకాణాలలో పత్తి విత్తనాల పాకెట్లను, రికార్డులను పరిశీలించారు. రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలని, గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. గ్రోమోర్ సెంటర్, ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే షాపులను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరికి సరిపడే ఎరువులను కూడా అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని, రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సూచించారు.

రైతులను మోసం చేస్తే చర్యలు



నెల్లికుదురు : నాసిరకం, నకిలీ విత్త నాలతో రైతులను మోసం చేస్తే ఆ షాపు యజమానిపై చట్టపరమైన చర్యలు తప్పవని నెల్లికుదురు మండల టాస్క్ ఫోర్స్ టీం ఎస్సై కనుకుల క్రాంతి కిరణ్, తహసీల్దార్ కోడి చింతల రాజు, మండల వ్యవసాయ అధికారి నెలకుర్తి రవీందర్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని టాస్క్ ఫోర్స్ టీం ఆధ్వర్యంలో శని వారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేం ద్రం-1, మన గ్రోమోరు షాపు, ఆగ్రోస్-3 షాపులలో తనిఖీలు నిర్వహించారు. షాపులలోని లైసెన్సులు, స్టాక్ రిజిస్టర్లు, బిల్లు బుక్కులు, వ్యవసాయ శాఖ సూచించిన రిజిస్టర్ల నిర్వహణ చెక్ చేశారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదులను కచ్చితంగా ఇవ్వాలని తెలిపారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవు



చిన్నగూడూరు : నకిలీ విత్తనాలు అమ్మితే డిలర్లపై చర్యలు తప్పవని చిన్న గూడూరు వ్యవసాయ అధికారి వీరసింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఎస్ఐ ఝాన్సీతో కలిసి ఫెర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం దుకాణంలో రిజిస్టర్, గ్రౌండ్ స్టాక్, బిల్ బుక్స్ తదితర వాటిని పరిశీలించారు.

ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-మహాదేవపూర్

ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీ అధికమవుతోందని, ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఎస్ఎఫ్ఐ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజు డిమాండ్ చేశారు. శనివారం మహాదేవపూర్ పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రయివేటు స్కూల్స్‌లో బుక్స్ యూనిఫామ్స్ అమ్ముతున్న పాఠశాల యజమాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పర్మిషన్స్ లేకుండా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను తక్షణమే మూసి వేయాలన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రైవేట్ కార్పొరేట్ ఫీజులుంతో పేద మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారుతోందని అన్నారు. ముందస్తు అడ్మిషన్ల పేరుతో కరపత్రాలు పంచుతూ ఇంటింటా ప్రచారం చేస్తూ ప్రజలకు మాయ మాటలు చెబుతూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఉన్నత చదువులకు వెళ్లే విద్యార్థులకు స్టడీ సర్టిఫికెట్స్, టీసీ తదితరవి ఇచ్చే సమయంలో నానా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. కొన్ని విద్యాసంస్థల్లో ఫిట్నెస్ లేని బస్సులు వినియోగిస్తున్నారని అన్నారు. సంబంధిత డ్రైవర్లకు లైసెన్స్ కూడా లేవని అన్నారు. ఎల్కేజీ చదివే విద్యార్థికి సంవత్సరానికి రూ.20వేల నుంచి రూ.30వేల వరకు వసూలు చేస్తున్నారని అన్నారు. తగు చర్యలు తీసుకోవడంతోపాటు విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



ఘనంగా హనుమాన్ జయంతి

నవతెలంగాణ-గణపురం

గణపురం మండల కేంద్రంలోని గణప సముద్రం సరస్సు కట్టపైన కొలువైన దక్షిణముఖ ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని పట్టు వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద పండితులు, ఆలయ అర్చకులు గోవర్ధన వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు చేసి మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఉత్తమ అధికారిగా రత్నం శ్రీనాథ్ ఎంపిక

నవతెలంగాణ -కోల్‌బెల్ట్



ప్రతి సంవత్సరం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణ తలమానికమైన సింగరేణి సంస్థలో ఉత్తమ ఉద్యోగులను ఎంపిక చేయడం ఆనవాయితీ. నేడు జరిగే ఆవిర్భావ వేడుకలకుగాను భూపాలపల్లి ఏరియా కేటీకే- ఓసీ-3 భూగర్భ గని నుండి డిప్యూటీ మేనేజర్ రత్నం శ్రీనాథ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రత్నం శ్రీనాథ్ మీడియాతో మాట్లాడుతూ అతి తక్కువ సర్వీస్‌లో తన పని విధానాన్ని గుర్తించి ఉత్తమ అధికారిగా ఎంపిక చేసిన భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సయ్యద్ హబీబ్ హుస్సేన్, కేటికె-8 గ్రూప్ ఏజెంట్ బిక్షమయ్య గని మేనేజర్ భాను ప్రసాద్, రాంబాబులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవార్డుకు ఎంపిక కావడంతో తనపై బాధ్యత పెరిగిందని, గనిలో యాజమాన్యం లక్ష్యానికి అనుగుణంగా రక్షణతో కూడిన ఉత్పత్తికి విఘాతం కలగకుండా చూస్తానన్నారు. భవిష్యత్తులో కార్పొరేట్ స్థాయిలో ఉత్తమ అధికారిగా ఎంపిక అయ్యేవిధంగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

గుండెపోటుతో సింగరేణి కార్మికుడు మృతి

నవతెలంగాణ - ములుగు



సింగరేణి కార్మికుడు గుండెపోటుతో మృతిచెందిన సంఘటన ములుగు జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. మద్ది అశోక్(40) అనే సింగరేణి కార్మికుడు ములుగు జిల్లా కేంద్రంలో కుటుంబ సభ్యులతో నివాసం ఉంటూ భూపాలపల్లి 8ఇంక్లైన్‌లో సింగరేణి కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం తన నివాసంలో అశోక్‌కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ములుగుజిల్లా ఏరియాఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-గోవిందరావుపేట

హనుమాన్ జయంతి వేడుకలను గోవిందరావుపేట మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలోని హనుమాన్ సన్నిధిలో, అయ్యప్ప స్వామి ఆలయం ఛైర్మెన్ డాక్టర్ గాంధీ ఆధ్వర్యంలో హనుమాన్ మాల ధారణ స్వాములతో అభిషేక కార్య క్రమాలు, అనంతరం హోమ కార్యక్రమం నిర్వహించారు. హనుమాన్ స్వాములకు ఆలయ పూజారి ఇరుముడ్లు కట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

అందరికీ తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు

కాంగ్రెస్ పార్టీ చిట్యాల టౌన్ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్ గౌడ్ • కాంగ్రెస్ పార్టీ చిట్యాల సీనియర్ నాయకులు గంగాధర రవీందర్





నవతెలంగాణ-చిట్యాల

నేడు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకొని ప్రజలు, పార్టీ జిల్లా, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ చిట్యాల మండల టౌన్ అధ్యక్షులు బుర్ర లక్ష్మణ్‌గౌడ్, సీనియర్ నాయకులు గంగాధర రవీందర్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం వారు నవతెలంగాణతో ప్రత్యేకంగా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి యనుమల రేవంత్ రెడ్డికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడంలో ఏఐసీసీ అధ్యక్షులు సోనియా గాంధీ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయడం గొప్ప విషయమని అన్నారు. రాష్ట్రంలో గత పది సంవత్సరాల నియంత పాలన అంతం చేసి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడం కోసం ప్రజల కృషి ఎంతో ఉందని అన్నారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలుపరుస్తూ ప్రజా రంజక పాలన కొనసాగిస్తున్నారని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ ఆధ్వర్యంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తున్న ప్రతి ఒక్కరికి తెలంగాణ అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. 10ఏండ్లుగా భూపాలపల్లి నియోజకవర్గంలో అధికారం ఉన్నా లేకున్నా ప్రజల వెంటే ఉంటూ వారి అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు వెన్నుదన్నుగా ఉన్న వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. భూపాలపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యేగండ్ర సత్తన్న జిల్లా నాయకులు, నాయకుల మనోభావాలు దెబ్బతీయకుండా పార్టీ కోసం పని చేసిన కార్యకర్తలను నాయకులను సముచిత స్థానం కల్పిస్తున్నారని అన్నారు. చిట్యాల మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని అన్ని వర్గాల ప్రజల శ్రేయస్సు కోసం పనిచేయాలని ఆకాంక్షించారు.

మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా





నవతెలంగాణ-భూపాలపల్లి

ధాన్యం తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా తెలిపారు. శనివారం కాటారం మండలం అంకుశపురం గ్రామ శివారులోని అన్నపూర్ణ ఆగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శుక్రవారం దామరకుంట గ్రామానికి చెందిన కొందరు రైతులు తక్కువ తూకం వేస్తున్నారని, దానివల్ల తాము నష్టపోతున్నామని దరఖాస్తు చేశారని తెలిపారు. దరఖాస్తును పరిశీలించి శనివారం ఆకస్మిక తనిఖీ చేశామని, తనిఖీలో దిగుమతి చేసేందుకు లారీల్లో ఉన్న ధాన్యం బస్తాలను తీయించి రైతుల సమక్షంలో తూకం వేయించారు. తూకంలో ఎలాంటి వ్యత్యాసం లేదని సక్రమంగానే ఉన్నదని ఏలాంటి అవకతవకలు జరిగినట్లు గుర్తించలేదని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఎక్కడైనా తూకాల్లో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు తూనికలు కొలతలు శాఖ అధికారి, పౌర సరఫరాల శాఖ అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. పౌరసరఫరాల సంస్థ మేనేజర్ రాఘవేందర్, పౌరసరఫరాల అధికారి నర్సింగరావు, తూనికల కొలతల శాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

మరమ్మతు పనులు పూర్తి చేయాలి

మహాదేవపూర్ : ప్రభుత్వ పాఠశాలలు ఆధునికతను సంతరించుకొని ఆహ్లాదకరంగా తయారు చేసేందుకు చేపట్టిన మరమ్మత్తు పనులను సకాలంలో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. శనివారం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, ఎంపీడీఓతో కలిసి మహాదేవపూర్ మండల కేంద్రంలో పర్యటించారు. పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మత్తు పనుల పురోగతిని పరిశీలించారు. ఎల్కేశ్వరం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో ర3.85 లక్షలు, మండల పరిషత్ పాఠశాలలో రూ. 3.94లక్షలతో చేపట్టిన మరమ్మతులను, బొమ్మాపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్‌యస్ పాఠశాలలో రూ.4.55 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను, మదేవపూర్ కేజీబీవీ పాఠశాలలో రూ.3.20 లక్షలతో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. కేజీబీవీల్లో బాలికల రక్షణ కోసం చుట్టూ ప్రహరీ నిర్మాణం ఆగస్టు 15 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పనులు చేపట్టిన గ్రామ సమాఖ్యలతో మాట్లాడుతూ.. జూన్ 20 వ తేదీ వరకు చేపట్టిన పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు అందచేయాలని అన్నారు. పనుల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం మహాదేవపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో హెడ్ మాస్టర్లు, కాంట్రాక్టు పనులు చేపట్టిన వీవోలతో సమీక్ష నిర్వహించారు. మహాదేవపూర్ మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలల్లో 3 జడ్పీహెచ్‌యస్, ఒక కేజీబివి ఉండగా 26 పాఠశాలల్లో రూ.కోటి4లక్షలతో మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు. పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి రెండు రోజుల ముందే పనులు పూర్తి చేయాలని అన్నారు. రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా పేరుపొందేలా పాఠశాలలను తయారు చేయాలని అన్నారు. అంతకుముందు రెండు పాఠశాలల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా కుట్టించిన స్కూలు యూనిఫామ్స్ ధరించి చిన్నారులు జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. డీఆర్డీఓ నరేష్, డీఈఓ రాంకుమార్, తహసీల్దార్ ప్రహ్లాద్ రాథోడ్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ డీఈ సాయిలు, ఏఈ రవీందర్, డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినయ్‌కుమార్, ఎంఈఓ దేవానాయక్, ఐకేపీ ఏపీఎం రవికుమార్ పాల్గొన్నారు.



పనులు సకాలంలో పూర్తి చేయాలి

• అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ

నవతెలంగాణ - ములుగు(వెంకటాపూర్)

తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి శ్రీజ అన్నారు. శనివారం వెంకటాపూర్ మండలం ఎల్లారెడ్డిపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జవహర్ నగర్ గ్రామ కస్తూర్బా గాంధీ పాఠశాల, ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పనుల పురోగతిని, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. అత్యవసర పనులు, తాగునీరు, మూత్రశాలల మరమ్మతులు, ఎలక్ట్రిఫికేషన్ లాంటివి ఎంపిక చేసి పూర్తి చేస్తున్నట్టు తెలిపారు. కేజీబీవీ వెంకటాపూర్ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా పనులు పూర్తి చేసుకోవాలని అన్నారు. పాఠశాల పున ప్రారంభం కంటే ముందే పూర్తి చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేక అధికారిని ఆదేశించారు. జరుగుతున్న పనులను ప్రతిరోజు పర్యవేక్షణ చేస్తూ నాణ్యతతో కూడిన పనులను సకాలంలో పూర్తి చేయవలసిందిగా ఏఈలను, మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. డీఈఓ పాణిని, సమగ్ర శిక్ష ప్లానింగ్ కోఆర్డినేటర్ అర్షం రాజు, ములుగు, వెంకటాపూర్ మండలాల తాత్కాలిక ఇన్‌చార్జి, మండల విద్యాశాఖ అధికారి సూర్యనారాయణ, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి

నవతెలంగాణ - ములుగు

జిల్లాలోని ముంపు ప్రాంతాలను పై యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు పి శ్రీజ నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీజ నీటి పారుదల శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే వర్షాకాలంలో విపత్తు నిర్వహణపై అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలోని చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, వాటి ప్రస్తుత నీటి నిలువ, పూర్తి నీటి నిల్వ సామర్థ్యం, కరకట్టల పరిస్థితి ఏవిధంగా ఉందనే అంశంపై ప్రాథమిక సర్వే నిర్వహించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా నీటిపారుదల శాఖ అధికారి అప్పలనాయుడు, ములుగు ఈఈ నారాయణ, అకులవారి ఘనపురం డీఈ యశ్వంత్, భద్రాచలం డీఈ గోపాల కృష్ణ, ఏఈలు, జెఏలు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల సమాచారం ఇవ్వాలి : జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే



నవతెలంగాణ-భూపాలపల్లి

జిల్లా ప్రజలు నిర్భయంగా మావోయిస్టుల ఆచూకీ సంభందిత సమాచారం, పోలీసులకు తెలపాలని, మావోయిస్టుల సమాచారమిచ్చిన వారికి నగదు బహుమతి అందిస్తామని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో కలిసి 10మంది మావోయిస్టుల ఫొటోలతో ఉన్న వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ 10 మంది మావోయిస్టులపై 65 లక్షల నగదు రివార్డు ఉంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు మావోయిస్టులకు సహకరించొద్దని, పోస్టర్‌లలో ఉన్నవారి గురించి తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించామని, గోదావరి పరివాహక ప్రాంతంలో నిఘా పెంచామని, జిల్లాకు సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర పోలీసులతో సమన్వయంతో పని చేస్తున్నామని అన్నారు. ఏదో ఒక ఘటన చేసి మావోలు తమ ఉనికి చాటుకోవాలనే ప్రయత్నంలో ఉన్నట్టు తమకు సమాచారం ఉందని అన్నారు. అటవీ గ్రామాల్లోని ప్రజలు మావోయిస్టులకు భయపడవద్దని, గ్రామాలకు వస్తే వారి సమాచారం ఎస్పి భూపాలపల్లి 87126 58100, భూపాలపల్లి డిఎస్పీ, 87126 58103, కాటారం డిఎస్పీ 87126 58104 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. లేదంటే డయల్ 100కు తెలపాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మావోయిస్టులు అజ్ఞాతాన్ని వీడి, జన జీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవనం గడపాలని పేర్కొన్నారు. డీఎస్పీ నారాయణ నాయక్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఎస్సైలు పాల్గొన్నారు.

నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాలు



2024 జూలై 1 నుండి దేశవ్యాప్తంగా నూతన చట్టాలను అమలు కానున్న సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా పోలీసులకు అవగాహన కార్యక్రమాలను, శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. కొత్తగా రూపొందించిన మూడు చట్టాలు వచ్చే జూలై నుండి అమలులోకి రానున్నాయని అన్నారు. మారిన చట్టాలను అనుగుణంగా కేసులను నమోదు చేసేలా సంసిద్ధమై ఉండాలన్నారు. నూతన చట్టాల ద్వారా కేసుల దర్యాప్తు, విధానాలు, విచారణ పద్ధతుల్లో మార్పు వస్తుందని, ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించేందుకు వీలు దొరుకుతుందని అన్నారు. డిఎస్పీ నారాయణనాయక్, డీసీఆర్‌బీ, ఎస్పి ఇన్‌స్పెక్టర్లు, రామకృష్ణ, వసంత్‌కుమార్, భూపాలపల్లి సీఐ నరేష్ కుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్లు రత్నం, కిరణ్, శ్రీకాంత్ జిల్లా పరిధిలోని ఎస్ఐ లు, కోర్టు డ్యూటీ అధికారులు, స్టేషన్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి : ప్రిన్సిపాల్

నవతెలంగాణ-మంగపేట

ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని తమ పిల్లల ఉజ్వల భవిష్యత్ కోసం ఆరాటపడే తల్లిదండ్రులు 10వ తరగతి పూర్తయిన పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించి తమ కలను సాకారం చేసుకోవాలని ఎక్కటి సరోజని శేషారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధానాచార్యులు గూళ్ళ వెంకటయ్య అన్నారు. శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో కళాశాల ప్రగతిని తెలిపే ఫ్లెక్సీలను కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రైవేటు కళాశాలలకు ధీటుగా బోధన చేస్తూ ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ ర్యాంకులను సాధించి 2024 వార్షిక పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిందని తెలిపారు. వేల రూపాయల విలువచేసే పాఠ్యపుస్తకాలను ఉచితంగా అందిస్తూ ఉచిత బోధన చేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరి ఉత్తమ విద్యను పొందాలని వెంకటయ్య కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు యాస రేణుకాదేవి, జన్నపు రెడ్డి జ్యోతిర్మయి, మండల సంతోష్ కుమార్, మాలోత్ లక్ష్మణ్, పాగి అనిల్ కుమార్ బండారి శ్రీనివాస్, జరుకుల రవీంద్ర నాయక్, మంతెన చిరంజీవి, సుదమల్ల వందన, నాంపల్లి వైష్ణవి బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

పేదింటి బిడ్డకు పెద్ద కష్టం



• లివర్ సమస్యతో

ఆస్పత్రిలో చేరిన బాలుడు

• ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు

నవతెలంగాణ-మల్హర్‌రావు

పేదింటి బిడ్డకు పెద్ద కష్టం వచ్చింది. రోజు అమ్మ ఒడిలో ఆలనాపాలన చేసే పసి బాలుడుకి ఊహించని లివర్ సమస్య వచ్చింది. వైద్యం చేయాలంటే రూ.35 లక్షల ఖర్చువుతుందని వైద్యులు సూచించడంతో బాలుని తల్లిదండ్రుల వద్ద చిల్లి గవ్వ లేకపోవడంతో ఆపన్నహస్తం ఎదురుచూస్తున్నారు. పూర్తి వివరాల్లోకెళ్తే...

మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన బుట్టి శ్యామల-రాజ్ కుమార్ యాదవ్ దంపతులు నిరుపేద కుటుంబానికి చెందినవారు. నిత్యం మేకల కాపరిగా, కూలి పనులు చేసుకొని జీవిస్తున్న వీరి జీవితంలో ఊహించని కష్టం వచ్చింది.ఈ దంపతులకు ఒకగాను ఒక 7 నెలల కుమారుడు హర్షిత్ కుమార్‌కు మూడు నెలల క్రితం కడుపునొప్పి రావడంతో మంచిర్యాల లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. 3రోజుల చికిత్స అనంతరం వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ లోని కిమ్స్ చిల్డ్రన్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు హర్షిత్‌కు లివర్ పూర్తిగా చెడిపోయిందని,మార్పిడి చేయాలని రూ.35 లక్షలు ఖర్చువుతుందని వైద్యులు సూచించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటికే రెండు మూడు ఆస్పత్రులకు తిరిగి రూ.5 లక్షల వరకు ఇల్లు గుళ్ళ చేసుకున్నట్లుగా కన్నీరుమున్నీరవుతున్నారు. ఈ క్రమంలో వైద్య చికిత్సకు డబ్బులు లేక, మరోపక్క బాలుని పరిస్థితి చూడలేక ఆ నిరుపేద దంపతులు ఆందోళన చెందుతున్నారు. ఆపన్నహస్తం కోసం దాతలు ముందుకు వచ్చి ఫోన 6304441688, 6305779113లో సంప్రదించి సహాయం చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రూ.10 వేలు అందజేసిన యాదవ సంఘం



రుద్రారం గ్రామానికి చెందిన బుట్టి శ్యామల రాజ్ కుమార్ యాదవ్ దంపతుల కొడుకు హర్షిత్ కుమార్ లివర్ సమస్యతో బాధపడుతున్న విష యాన్ని తెలుకున్న అఖిల భారత యాదవ మహాసభ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు మేకల సంపత్ యాదవ్ శనివారం తన బృందంతో వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

అన్నారం బ్యారేజీ మరమ్మత్తుల పనులను
నిపుణుల బృందం పరిశీలన

నవతెలంగాణ-మహాదేవపూర్



కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నారం సరస్వతి బ్యారేజ్ మరమ్మతు పనులను శనివారం నిపుణుల బృందం సభ్యులు పరిశీలించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ అధికారుల సూచనలు మేరకు జలవనరులు పి రాజా సాకేత్, ఎన్ఐటిడబ్ల్యూజి ఎల్ రమణమూర్తి, మెకానికల్‌శాఖ సత్య నారాయణ, ఈఎన్సీ అనిల్‌కుమార్, సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్ఈ కరుణాకరన్ ఇరిగేషన్ అధికారులు ఈఈ యాదగిరితో కలిసి అన్నారం బ్యారేజ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రౌటింగ్, సి పేజ్ ఏర్పాట్లతో పాటు సిసి బ్లాక్ ఇసుక నిలువల తొలగింపు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిశోదనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఒంటిపై డీజిల్ పోసుకొని రైతు హల్చల్



నవతెలంగాణ-ఏటూరునాగారం ఐటీడీఏ

మండలంలోని పెద్ద వెంకటాపురం రైతు మహబ్ హుస్సేన్ తన పట్టా భూమిని చదును చేస్తుండగా అటవీశాఖ అధికారులు అడ్డుకోవడంతో మనస్తాపానికి గురై డీజిల్ ఒంటిపై పోసుకుని హల్చల్ చేసిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. మహబ్ హుస్సేన్ అనే యువ రైతు జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను పెట్టుకొని మట్టిని తరలించి భూమిని చదును చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రేంజ్ అధికారి నరేందర్ తన సిబ్బందితో కలిసి పెద్ద వెంకటాపురం చేరుకొని వాహనాలను అదుపులోకి తీసుకొని రేంజ్ కార్యాలయానికి తరలించారు. ఇదే విషయంపై రైతులకు, అటవీశాఖ అధికారులకు వాగ్వాదం జరిగింది. తమకు పోడు పట్టాలు న్నాయని, తమను వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. మనోవేదనకు గురైన హుస్సేన్ ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పు అంటి చుకునే ప్రయత్నం చేశారు. చుట్టు పక్కల వారు అడ్డుకొని అతడి ఒటిపై నీరు పోసి కాపాడారు. ఈ విషయంపై రేంజ్ అధికారి నరేందర్‌ను వివరణ కోరగా 205 ఫారెస్ట్ కాంపా టోహెంట్‌లో ఉందని, దానికి ఎలాంటి పట్టాలు లేవని తెలి పారు. ఏదైనా ఆధారాలుంటే తమ కార్యాలయానికి తీసుకు రావాలని ఆయన కోరారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం

నవతెలంగాణ-మహదేవపూర్

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంతతను పొందుతారని జిల్లా పిరమిడ్ సొసైటీ అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ అన్నారు. శుక్రవారం ధ్యాన సొసైటీ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గౌరవ అధ్యక్షుడుగా బుస్స మురళి, అధ్యక్షురాలుగా బుస్స సునీత, జనరల్ సెక్రెటరీగా కలికోట వరప్రసాద్, ఉపాధ్యక్షులుగా కలికోట పద్మజ, నీరజ, సహ కార్యదర్శిగా దేవునూరి గీత, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా వేల్పుల చంద్రమౌళి, కోశాధికారిగా కలికోట నాగవర్దన్, గౌరవ సలహాదారుగా గుడాల అరుణ, కార్యవర్గ సభ్యులుగా సూరం శ్రీదేవి సిరిపురం రేఖ, భాగ్యలక్ష్మి పనజ లక్ష్మీనారాయణ విమల లక్ష్మిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గడ్డం రామకృష్ణ మాట్లాడుతూ ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. రోగనిరోధకశక్తి పెరిగి వ్యాధులు దరిచేరవని, భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన జీవనాన్ని గడపవచ్చన్నారు. నిత్యం ధ్యానం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

బడి బాటకు వేలాయే.. !



రేపటి నుంచి 19 వరకు కార్యక్రమం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంపే లక్ష్యం

నవతెలంగాణ-మల్హర్‌రావు

సర్కారు బడులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ఏటా మాదిరిగానే ఈసారి కూడా పాఠశాలలు పునర్ ప్రారంభానికి ముందుగా బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 3 నుంచి 19 వరకు కార్యక్రమాన్ని నిర్వహించేలా షెడ్యూల్ విడుదల చేసింది. చిన్నారులను ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో 1వ తరగతిలో, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులను 6వ తరగతిలో చేర్పించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అంగన్‌వాడీల్లో ఉన్న పిల్లలను ప్రాథమిక పాఠశాలల్లో చేర్పించేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఇప్పటికే నెల రోజులుగా ప్రయివేటు కార్పొరేట్ పాఠశాలల వారు గ్రామాల్లో, పల్లెల్లో ఇంటింటా తిరుగుతూ తమ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను ఒప్పిస్తూ అడ్మిషన్లు చేయించుకుంటున్నారు. ఇక సర్కారు బడుల్లో మౌలిక వసతులతోపాటు, ఉపాధ్యాయుల కొరత ప్రధాన సమస్యగా మారింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతులు లేకపోవడంతో తల్లిదండ్రులు వారి పిల్లలను ప్రయి వేటు పాఠశాలల్లోనే చేర్పించినట్లుగా తెలుస్తోంది. రెండేళ్ల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశపెట్టినప్పటికి ఆశించిన ఫలితాలు కానరావడం లేదు. మండలంలో 380 మంది 1వ తరగతిలో చేరాల్సి ఉంది. అయితే ఎంతమంది ప్రభుత్వ పాఠశాలల్లో చేరుతారో చూడాల్సిందే. 6 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లలు మండలంలో 250 ఉన్నారు. వీరిలో ఎంతమంది చేరుతారనేది తెలియాల్సి ఉంది.

ఖాళీలతో సతమతం....

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది.మండలంలో మొత్తం 96 పోస్టులు ఉండగా 70 మందిలోపే ఉన్నట్టుగా తెలుస్తోంది. సర్కారు బడుల్లో ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేరు, విద్యార్థులు ఉన్న చోట ఉపాధ్యాయులు లేరు.విద్యార్థులు లేనిచోట యేటా ఒక పాఠశాల మూత పడుతున్న పరిస్థితి. మండలంలో ఇప్పటికే గట్టుపల్లి, లంబాడి పల్లి,వెల్మలపల్లి,కేశారం పల్లి, జిమ్ పల్లి తదితర ఐదు ప్రాథమిక పాఠశాలలు మూత పడ్డాయి. ఉపాధ్యాయులు లేనిచోట సర్దుబాటు చేసిన వారు విద్యార్థులకు న్యాయం చేయలేని పరిస్థితులు ఉన్నాయి.

మౌలిక వసతులు లేకపోవడంతోనే....

ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేకపోవడంతోనే విద్యార్థుల సంఖ్య పెరగడం లేదని తెలుస్తోంది. అయితే గత ప్రభుత్వం మన ఊరు-మన బడి కార్యక్రమం చేపట్టిన పూర్తిస్థాయిలో అమలు కాలేదు.కొన్ని పాఠశాలల్లో మాత్రమే అసంతృప్తిగా పనులు జరిగాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు తరువాత మహిళా సంఘాల ద్వారా అమ్మ ఆదర్శ కమిటీల పేరిట పాఠశాలల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. బడులు ప్రారంభించే లోగా పూర్తిస్థాయిలో పూర్తియ్యేలా కానరావడం లేదు. తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలం, ఇతర మౌలిక వసతులు లేని కారణంగా తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాలకు పంపేందుకు మొగ్గు చూపడం లేదని తెలుస్తోంది.



డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

ఎమ్మెల్యేకు ఏబీవీపీ వినతి

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని భూపాలపల్లిలో విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ భూపాలపల్లిశాఖ ఆధ్వర్యంలో శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రాంత కార్యసమితి సభ్యులు వేల్పుల రాజు కుమార్ మాట్లాడుతూ నియోజక వర్గంలో గత పాలకుల ప్రభుత్వం వలన విద్యారంగ సమస్య ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని అన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే చొరవ తీసుకొని విద్యారంగ సమస్యలు పరిష్కరించి భూపాలపల్లి నియోజక వర్గ విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. భూపాలపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలిక వసతుల కల్పించాలి అని, విద్యార్థుల కోసం హాస్టల్ వసతి,నీటి వసతి కల్పించాలని కోరారు. చిట్యాల మండల కేంద్రం లో ఉన్న ఎస్సీ బాలికల వసతుల గృహంను పోస్ట్ మెట్రిక్ హాస్టల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం లో మైనింగ్ కలశాల ఏర్పాటు చేయాలని, చిట్యాల మండల కేంద్రంలో డిగ్రీ కలశాల ఏర్పాటు చేయాలని కోరారు. దీనికి ఎంఎల్ఏ సానుకూలంగా స్పందించి సంబంధించిన శాఖ అధికారులతో మాట్లాడినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు వికాస్, శివాజీ, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.

'రెయిజింగ్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం భద్రయ్య

నవతెలంగాణ - ములుగు



ఇసుక క్వారీలలో యంత్రాలతో పనిచేస్తున్న రెయిజింగ్ కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని, క్వారీలలో స్థానిక గిరిజనులకే ఉపాధి కల్పించాలనీ ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం భద్రయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, టీఎస్ఎండిసి పిఓ తారకకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం భద్రయ్య మాట్లాడుతూ ములు గు జిల్లాలోని ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాలలో నడుస్తున్న ఇసుక క్వారీలు నిబం ధనలకు విరుద్ధంగా రెయిజింగ్ కాంట్రాక్టర్స్ రాత్రి పూట భారీ యంత్రాలతో ఇసుకను డంపింగ్ చేస్తూ స్థానిక గిరిజనులకు ఉపాధి లేకుండా ఇష్టానుసారముగా ఇసుకను డంపింగ్ చేస్తున్నారని అన్నారు. ఏజెన్సీ గ్రామాలైన ఏటూరు నాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం మండలాలలో గిరిజనులతో గ్రామ సభలు నిర్వహించి, గిరిజనులక ఉపాధి కల్పించాలని తీర్మానం చేసినా అమలు చేయడం లేదన్నారు. భారీ యంత్రాలతో ఇసుకను డంప్ చేయడం వల్ల స్థానిక గిరిజనులకు ఎలాంటి ఉపాధి లేకుండా పోతున్నదన్నారు. గోదావరి నదిలో నిబంధనల ప్రకారం 2 మీటర్లు లోతు వరకు తీయవలసి ఉన్నప్పటికి, గోదావరి నదిలో బావులను తలపిస్తున్న విధంగా ఎక్కువ లోతు తవ్వి ఇసుకను తీస్తున్నారన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. ఇసుక క్వారీలలో భారీ యంత్రాలతో ఇసుక తీయడం నిలిపివేసి, ఇసుక క్వారీలలో స్థానిక గిరిజనులకే ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ టీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఊట్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

నవతెలంగాణ -తాడ్వాయి

మండలంలోని కాటాపూర్ రామాలయం వద్ద శనివారం ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు జరిపారు. హనుమాన్ ఇరుముడి మహోత్సవం నిర్వహించారు. 31 రోజు దీక్ష పూర్తి చేసుకున్న ఆంజనేయ స్వామి మాలాధారులు శనివారం ఇరుముడి మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాటాపూర్ రామాలయం ప్రాంగణంలో గణపతి హోమం, నవగ్రహాల పూజలను వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించుకున్నారు. అనంతరం ఇరుముడి మహోత్సవాన్ని పూర్తి చే సుకున్నారు. గ్రామంలోని మహిళలు కుటుంబ సభ్యులతో కలిసి ఇరుముడి ప్రాంగణం వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో గ్రామంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి కూర రాజు, అంజన్న స్వాములు దేవరకొండ రాజు, రంగు సత్యనారాయణ, కాయితి కష్ణ చారి, మార్క ప్రణయ్, గడ్డం సత్యం మొదలగు 41 మంది అంజనేయ స్వాములు, దాతలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి : జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ - ములుగు



రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జూన్-2 తేదీ కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో జరగ నున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల మ హోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని శనివారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 2న అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతా కాన్ని ఆవిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. పండుగ వాతావరణం లో తెలంగాణ ఆవి ర్భావ దినోత్సవం ఘనంగా జరుపుకోవాలని, గ్రామ పంచాయతీలలో ప్రత్యేక అధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించాలని సూచించారు. అలాగే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు-2024 సందర్భంగా జరుగనున్న కార్యక్రమాల వివరాలు వెల్లడించారు.ఈ వేడుకలకు అధికారులు , ప్రజలు, విద్యార్థులు, మీడియా ప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-మహదేవపూర్

హనుమాన్ జయంతి సందర్భంగా మండలంలోని అనుబంధ కట్టమీద ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక అభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాళేశ్వరం గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు. పూజ అనంతరం అర్చక స్వాములు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
వరంగల్
ఆదివారం | జూన్ 2, 2024 | www.navatelangana.com

నిర్దేశిత ప్రమాణాలు పాటించాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

నవతెలంగాణ-వరంగల్



నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తేనే అభివద్ధి పనుల బిల్లుల చెల్లించడం జరుగుతుందని బల్దియా కమి షనర్ అశ్విని తానాజీ వాకడే స్పష్టం చేశారు. బల్ది యా పరిధిలోని సురేంద్రపురి కాలనీ ఏకశిలా పా ర్కు 100 ఫీట్ రోడ్డు వడ్డేపల్లి తదితర ప్రాంతాల లో అభివద్ధి పనులు పూర్తి చేసిన వాటికి బిల్లుల చెల్లింపుకై కమిషనర్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించి నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాలు చేపట్టారో లేదో తెలుసుకోవడానికి పొడవు అడ్డు కొలతలు వేసి పరిశీ లించారు.ఈ సందర్భం గా కమిషనర్ మాట్లాడుతూ నిబంధనల మేరకు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు బిల్లులు చె ల్లించడం జరుగుతుందని అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈలు) మాత్రమే సంబంధిత నిర్మాణ పనులను రికార్డు చేయాలని ఇతర అధికారులు రికార్డు చేసే బిల్లులను పరిగణలోకి తీసుకోవడం జరుగదని తెలిపారు.అనంతరం టౌన్ ప్లానింగ్ అనుమతుల కు సంబందించి పోచమ్మ కుంట లోని రెసిడెన్షియల్ భవన నిర్మాణ అనుమతి కోసం కాజీపేట డి-మార్ట్ ప్రాంతంలోని రెహమత్ నగర్ వద్ద ఆక్యుపెన్సీ ధ్రువ పత్రం జారీ కోసం కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీ లించి మాట్లా డారు. కార్యక్రమంలో ఈఈ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



గుడుంబా స్థావరాలుపై పోలీసుల దాడులు

నవతెలంగాణ-ఖానాపురం

మండలంలోని నాజీ తండా, బోటి మీది తండా గ్రామాల శివారులలో గుడుంబా తయారు చేస్తున్నారని పక్కా సమాచారంతో శనివారం ఆయా గ్రామాలపై స్థానిక పోలీసుల సహకారంతో ఆబ్కారి శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. దాడులలో 35లీటర్ల గుడుంబా,వంద కేజీల బెల్లం, ఐదు కేజీల బెల్లం(పటిక) స్వాధీనం చేసుకొని, రెండు వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు వారు పేర్కొన్నారు. అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న 9మందిపై కేసు నమోదు చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నాటు సారాను వంద రోజులలో పూర్తిగా నియంత్రించాలని ప్రభుత్వ ఆదేశానుసారాలతో దాడులు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. అనంతరం ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావు తండావాసులతో సమావేశం ఏర్పాటు చేసి కౌన్సిలింగ్ నిర్వహించారు. నాటు సారా తయారు చేసినా, అమ్మకాలు జరిపినా కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మురళీధర్, శ్రీనివాస్ రెడ్డి, సీఐ లు రమేష్ చందర్, నరేష్ రెడ్డి, ఎస్సై లు రాజన్న , శిరీష, పోలీసు ఎస్సై రఘుపతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.



గన్ పార్క్ వద్ద కార్పొరేటర్లు నివాళి

నవతెలంగాణ కాశిబుగ్గ

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరుల సూపం వద్ద నివాళులు అర్పించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్యాండిల్ ర్యాలీలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్,కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, పల్లం పద్మ రవి, సిద్ధం రాజు, భోగి సువర్ణ సురేష్, సీనియర్ నాయకులు టి రమేష్‌బాబు, తదితరులు పాల్గొని అమరుల స్థూపానికి నివాళులు అర్పించారు.

వివాదాస్పదంగా మారుతున్న మెమో నెం 11143

టీచర్ల నిరసనకు కారణమైన విద్యాశాఖ మెమో

6,7 తరగతుల గణిత బోధనకు ఫిజిక్స్ టీచర్లు !

పరిశీలనకు నోచుకోని ఆర్‌సీ నెం.77

నవతెలంగాణ-వరంగల్



ఇటీవల తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ జారీ చేసిన మెమో నెంబర్ 11143 గణిత, సైన్స్ ఉపాధ్యాయుల మధ్య తీవ్ర వివాద అంశంగా మారింది. ఉన్నత పాఠశాలలో 6,7 తరగతులకు గణితశాస్త్రాన్ని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బోధించాలన్న మెమోపై భౌతికశాస్త్ర ఉపాధ్యాయుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత పాఠశాలలో కొత్తగా భౌతిక శాస్త్ర స్కూల్ అసిస్టెంట్లు పోస్టులను అప్‌గ్రేడ్ చేశారు. ఇందులో భాగంగా 2002లో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు నియమించబడ్డారు. అయితే అప్పుడున్న పరిస్థితుల్లో ఉన్నత పాఠశాలలో సబ్జెక్టుల ఉపాధ్యాయుల కొరత ఉండగా, దీన్ని దృష్టిల్లో విద్యాబోధన కుంటుపడకుండా ఉండాలనే ఉద్దేశంతో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులకు 6,7 తరగతి గణితశాస్త్రాన్ని సందర్భాన్ని బట్టి బోధించాలని ప్రభుత్వం, విద్యాశాఖ సూచనలు చేసింది. అయితే ఉన్నత పాఠశాలలో ఎవరికి తోచినట్టు వారే ఆయా పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయులపై 6,7 తరగతులు బోధించాలని ఒత్తిడి తీసుకొచ్చారు. అంతేకాకుండా అప్పుడున్న విద్యా బోధన పద్ధతులతో పాటు ఉన్నత తరగతుల్లో భౌతికశాస్త్రంలో అత్యధిక సిలబస్ ఉండడం, వీటిని తక్కువ సమయంలో మొత్తం సిలబస్‌లను పూర్తి చేయాలని విద్యాశాఖ నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో అప్పటి నుంచి సైన్స్ ఉపాధ్యాయులు భౌతికశాస్త్రంతో పాటు, గణిత శాస్త్రాన్ని కూడా బోధిస్తూ తరగతులను నెట్టుకొచ్చారు.

సీసీఈ విధానంతో సిలబస్‌లో పెను మార్పులు...

2009లో కొత్త విద్యహక్కు చట్టం వచ్చింది. అప్పటి నుంచి సమగ్ర నిరంతర మూల్యాంకనం (సీసీఈ) ఆధారంగా పుస్తకాలల్లోని సిలబస్ మారి భౌతికశాస్త్రంలో విద్య ప్రమాణాలకు అనుగుణంగా ప్రయోగశాల కత్యాలు, బోధనా లక్ష్యాలను సాధించే ప్రక్రియలో భౌతికశాస్త్ర విద్యాబోధన గణిత శాస్త్ర భోధనకు తక్కువేమీ కాకుండా ఎక్కువ భారం కలిగి ఉండేది. ఈ విషయమై భౌతికశాస్త్ర ఉపాధ్యా యులలో ప్రతీసారి చర్చ జరిగేది.2014లో తెలంగాణ రాష్ట్రం నూతనంగా ఏర్పాటు కాగా అప్పుడు విద్యాశాఖ మళ్లీ ఆర్‌సీ నెంబర్ 77ను వెలువరిచింది. దీని ప్రకారం భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు 8,9,10 తరగతులతో పాటు 6,7 తరగతులకు ఏదైనా ఒక సబ్జెక్టును బోధిస్తే సరిపోతుందని సూచించింది.

మెమో నెం 11143 పై అధికారులు పునరాలోచించాలి : (వెనిశెట్టి కష్ణమూర్తి, ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడు, వరంగల్)



ఇటీవల ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులు ఆరు, ఏడు తరగతులకు గణితం బోధించాలని విడుదల చేసిన ఉత్తర్వులపై ప్ర భుత్వం పునరా లోచించాలని, గణిత విషయ నిపుణులు ఉన్న పాఠశాలల్లో సైన్స్ ఉపాధ్యాయుడు గణితం బోధించడం సమంజసం కాదు. ఫిజికల్ సైన్స్ యొక్క సిలబస్, ఇన్‌స్పైర్, సైన్స్ ఎగ్జిబిషన్స్,సైన్స్ సెమినార్స్, లాంటి కార్యక్రమాలతో పాటు సిలబస్ కాఠిన్యతను బోధనా భారాన్ని దష్టిలో పెట్టుకుని అధికారులు ప్రస్తుత విద్యాశాఖ మెమో నెంబర్ 11143ని సవరించాలి.

జిమ్ పరికరాలకు మరమ్మతులు పూర్తి

బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్

నవతెలంగాణ-వరంగల్

జిమ్ అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా అదనపు కమిషనర్ అను సుర్ రషీద్ తెలిపారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో గల జిమ్‌ను శనివారం అదనపు కమిషనర్ క్షేత్ర స్థాయిలో సందర్శించి జిమ్ పరికరాల స్థితిగతులను స్టేడియం బాధ్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు జిమ్‌లోని పరికరాల తీరును పరిశీలించడం జరుగుతుందని, జిమ్‌లో గల పరికరాలు క్రీడాకారులు వినియోగించుకునే క్రమంలో పరికరాలు దెబ్బ తినడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తాత్కాలికంగా జిమ్‌లోని పరికరాల వినియోగాన్ని నిలిపివేసినట్టు తెలిపారు. ఇటీవల బల్దియా సుమారు రూ.50వేలు వెచ్చించి వాటికి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయించిందని, ఇప్పటి నుండి నగరవాసులు దేహదారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి వివిధ రకాల వ్యాయామాల నిమిత్తం జిమ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శంకర్ లింగం, ఎస్ ఎఫ్ఓ దయానంద్, కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొ న్నారు.



రాష్ట్ర అవతరణ ఉత్సవాలను జయప్రదం చేయాలి

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

నవతెలంగాణ-పర్వతగిరి

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్స వాలను నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. వర్ధన్నపేట నియోజక వర్గానికి చెందిన 4మండలాలు, 13డివిజన్లలో మండల పార్టీ, డివిజన్ అధ్యక్షుల నాయకత్వంలో జూన్ 2న ఉదయం 8:30 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. కార్య క్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు,పార్టీ అభి మానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాన్ని జయ ప్రదం చేయాలని ఎమ్మెల్యే కోరారు.

దళిత ప్రజా ప్రతినిధులను అవమానించడం సబబు కాదు

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య

నవతెలంగాణ-పర్వతగిరి




దళిత ప్రజా ప్రతినిధులను అవ మానించడం సబబు కాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. వర్ధన్నపేట మండల కేంద్రంలో శని వారం ఆయన విలేకరులతో మాట్లా డారు. దొరల పార్టీలో చేరి దళిత ప్రజాప్రతినిధులను స్వేరో నాయకులు అవమానించడం సబబు కాదని, బహుజన పార్టీని ఆంఎస్ ప్రవీణ్ కుమార్ ఎందుకు వదిలే శాడన్నారు. కేసీఆర్ దొర చెంతకు ప్రవీణ్‌కుమార్ ఎందుకు చేరారని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ముసుగులో ఉన్న స్వేరో నాయకులు వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బహుజన నినాదంతో దళితులను ఆర్ఎస్ ప్రవీన్‌కుమార్ మోసం చేశారని విమర్శించారు.


తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి

నవతెలంగాణ-పరకాల




తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు అయిన సందర్భంగా ఆదివారం రాష్ట్ర అవతరణ దినోత్స వాన్ని ఘనంగా జరుపుకోవాలని కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు, బూత్ అధ్యక్షుడు కొయ్యడ శివకుమార్ కోరారు. మండలంలోని కామారెడ్డిపల్లి గ్రామంలో నిర్వహించనున్న దశాబ్ది ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



























































Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.